PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి.....



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 202, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శనివారం - 12 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. రంగంలోకి రాహుల్ గాంధీ

### 2029 లక్ష్యంగా కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులు



ఢిల్లీ,: 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులకు అగ్ర నాయకత్వం శ్రీకారం చుట్టింది. ఏఐసీసీ జాతీయ కార్యదర్శుల నియామకాల కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ప్రియాంకా గాంధీ వాద్రాతో కలిసి ఆయన ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో సోమవారం నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి.

## బ్రిక్స్ కూటమితో భారత్‌కు లాభమేంటి?.. కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు.. చిదంబరానికి శశి థరూర్ కౌంటర్!



ఢిల్లీ,: భారత్ ఆతిథ్యంలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ప్రారంభం కానున్న తరుణంలో ఈ కూటమి వల్ల దేశానికి కలిగే ప్రయోజనాలపై కాంగ్రెస్ పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. బ్రిక్స్ వల్ల భారత్‌కు చేకూరిన స్పష్టమైన ప్రయోజనాలు ఏమిటని పార్టీ సీనియర్ నేత పి. చిదంబరం ప్రశ్నించగా, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాత్రం ఈ కూటమి ప్రాధాన్యతను గట్టిగా సమర్థించారు. ఇది గ్లోబల్ సౌత్ దేశాలకు ఒక ముఖ్యమైన వేదిక అని, భారత్ దౌత్య శక్తికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో మాట్లాడిన శశి థరూర్.. ఈ కూటమి ప్రాముఖ్యతను వివరించారు. 11 దేశాల ఈ సమూహం ప్రపంచ జనాభాలో,

## మూసీ ప్రక్షాళనపై కొత్త ట్విస్ట్.. రేవంత్ సర్కార్‌కు ఎన్జీటీ నోటీసులు!



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన, అభివృద్ధి ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన సవాల్ ఎదురైంది. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు,



## మా జుట్టు పట్టుకుని లాగారు: ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి జరిగిందని, అవమానకరమైన ప్రవర్తన ఎదురైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ జాతీయమానవహక్కుల కమిషన్‌ను (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆశ్రయించింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి నేతృత్వంలోని మహిళా ఎమ్మెల్యేలబృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది.

## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

- ★ వీరప్పన్ మంత్రి అయితే ఎలా ఉంటుందో, రేవంత్ సీఎం కావడం అలాగే ఉందన్న కేటీఆర్
- ★ సీఎం కాకముందు ఆర్టీఐతో బ్లాక్‌మెయిల్ చేసి బతికారని ఆరోపణ
- ★ హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములపై సీఎం కన్ను పడిందన్న మాజీ మంత్రి
- ★ భూదందాల వల్లే రేవంత్ రాజీనామా చేయాల్సి వస్తుందని జోస్యం
- ★ రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్న కేటీఆర్



హైదరాబాద్, : సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే.. ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

- దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- నెలరోజుల్లో ప్రభుత్వ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశం
- సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచన
- క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజా సమస్యలు తెలుసుకోవాలని దిశానిర్దేశం



అమరావతి,: ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు.

నెల రోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే..

ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు.

## బ్రిక్స్ సదస్సు సందర్భంగా పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

- పుతిన్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక కానుక.. ఏమిటీ ‘తిరుక్కురళ్’ ప్రాధాన్యత?
- రష్యా అధ్యక్షుడికి ‘తిరుక్కురళ్’ రష్యన్ అనువాదం బహూకరణ
- తమిళ ప్రాచీన సాహిత్య గ్రంథం తిరుక్కురళ్
- మానవతా విలువలు, నైతికతపై తిరువళ్లువర్ చేసిన రచన

ఢిల్లీ,: బ్రిక్స్ సదస్సు-2026 నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ,






## ఓటర్ల జాబితా సవరణ: సమంత, విజయ్ దేవరకొండ, వీవీఎస్ లక్ష్మణ్ సహా ప్రముఖులకు నోటీసులు

## బ్రిక్స్ సదస్సుకు సర్వం సిద్ధం.. ఢిల్లీకి వచ్చే దేశాధినేతల పూర్తి జాబితా ఇదే!




- ఢిల్లీ వేదికగా నేటి నుంచి బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- హాజరు కానున్న రష్యా, చైనా అధ్యక్షులు సహా పలువురు అగ్రనేతలు
- ప్రధాని మోదీతో వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేకంగా భేటీ
- ఆహార, ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థలపై ప్రధానంగా చర్చ
- అగ్రనేతల రాకతో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి - కలెక్టర్లకు మంత్రి లోకేశ్ ఆదేశం..



అమరావతి: పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించే దిశగా కలెక్టర్లు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యా ప్రమాణాల పెంపుతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

## ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర.. మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు: రేవంత్ రెడ్డి

- శాసనసభ సజావుగా జరగకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రలు జరిగాయన్న రేవంత్ రెడ్డి
- ప్రజాప్రతినిధులను, పోలీసులను దూషిస్తూ మూడు రోజులు సభను అడ్డుకున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ కుట్రలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంస



హైదరాబాద్, : శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఈరోజు నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరపున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను

## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం.. రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు



- స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన షర్మిల
- కమిటీలో రుద్రరాజు, పల్లంరాజు, కృపారాణి, తులసిరెడ్డి తదితర నేతలు
- గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం

అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన ‘రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ’ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత



- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ

అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ‘నేతన్న భరోసా’ పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత,

## బ్రిక్స్ సదస్సుకు సర్వం సిద్ధం.. ఢిల్లీకి వచ్చే దేశాధినేతల పూర్తి జాబితా ఇదే!




ఢిల్లీ,: బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సుకు భారత రాజధాని ఢిల్లీ సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో (శని, ఆదివారాలు) జరగనున్న ఈ కీలక సమావేశాల కోసం ప్రపంచ దేశాల అగ్రనేతలు, ప్రతినిధులు ఇప్పటికే భారత్‌కు చేరుకుంటున్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సహా పలువురు ప్రపంచ స్థాయి నేతలు హాజరవుతుండటంతో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

భారత్‌కు విచ్చేయుచున్న అతిథులు వీరే..

ఈ సదస్సు కోసం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరాతో పాటు కొత్తగా చేరిన ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాల అధినేతలు, ప్రతినిధులు ఢిల్లీకి చేరుకున్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ-జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్డీబీ) అధిపతులు కూడా ఈ సమావేశాల్లో పాలుపంచుకోనున్నారు. అగ్రనేతలకు ఆతిథ్యం ఇస్తున్న హోటళ్లు వారి కోసం ఆహారం, భద్రత, ఇతర సేవల విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ చర్చల ద్వారా ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు సమష్టి పరిష్కారాలు కనుగొనాలని బ్రిక్స్ కూటమి లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రపంచ సవాళ్లే ప్రధాన అజెండా

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం (ముఖ్యంగా హార్ముజ్ జలసంధి దిగ్బంధనం), అమెరికా వాణిజ్య విధానాల వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఈ సదస్సు జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆహార భద్రత, ఇంధన రంగంలో సహకారం, ఆరోగ్యం, విపత్తుల నివారణ, కీలక వస్తువుల సరఫరా వ్యవస్థలలో సమష్టిగా స్థితిస్థాపకతను పెంపొందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. సంక్లిష్టంగా మారిన ప్రస్తుత ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో బ్రిక్స్ కూటమిని ఒక కీలక శక్తిగా నిలబెట్టాలని భారత్ భావిస్తోంది.

మోదీతో పుతిన్ ద్వైపాక్షిక చర్చలు

ఈ సదస్సులో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేకంగా ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. పుతిన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం గురువారం రాత్రే ఢిల్లీకి చేరుకున్నారు. ఈ భేటీలో రక్షణ, ఇంధనం, సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాల బలోపేతం వంటి పలు కీలక అంశాలపై వీరు చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించే మార్గాలపై దృష్టి సారించనున్నారు.

## కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. రంగంలోకి రాహుల్ గాంధీ

మొదటి పేజి తరువాయి

ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో సోమవారం నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. దాదాపు 120 మంది నేతలను ఇందుకు ఎంపిక చేశారు. గ్రూపులుగా విభజించి ఒకేసారి 10 మందిని రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ చేస్తున్నారు. అభ్యర్థుల ప్రొఫైల్, గతంలో చేసిన పనులు, రాజకీయ దృక్పథంపై రాహుల్ ప్రశ్నలు అడుగుతుండగా, ప్రియాంకా గాంధీ మరిన్ని వివరాలు రాబడుతున్నారు. ఈ నియామకాల్లో యువతకు, 'సంగఠన్ సృజన్' కార్యక్రమంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత జాతీయ కార్యదర్శుల్లో 60 శాతానికి పైగా మార్పులు తప్పవని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు, పార్టీలో మరిన్ని కీలక మార్పులు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలో ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, దానికి ప్రియాంకా గాంధీని చైర్‌పర్సన్‌గా నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అలాగే, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పదవీ విరమణ చేయవచ్చని, ఆయన స్థానంలో కేసీ వేణుగోపాల్‌ను నియమించవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే, అక్టోబర్ చివరి నాటికి జిల్లా అధ్యక్షుల నియామకాలు పూర్తి చేస్తామని కేసీ వేణుగోపాల్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ మార్పుల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మార్పుపైనా చర్చ జరుగుతోంది. ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్నారని, దీంతో ఆమె స్థానంలో కొత్తవారిని నియమించవచ్చని కొందరు నేతలు చెబుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆమె తన బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు. రాష్ట్రంలో పార్టీ సమన్వయం, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై దృష్టి సారించారు. మొత్తంగా ఈ మార్పుల ద్వారా 2029 నాటికి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్ఠానం అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## బ్రిక్స్ కూటమితో భారత్‌కు లాభమేంటి?..
## కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు.. చిదంబరానికి శశి థరూర్ కౌంటర్!

మొదటి పేజి తరువాయి

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో మాట్లాడిన శశి థరూర్.. ఈ కూటమి ప్రాముఖ్యతను వివరించారు. 11 దేశాల ఈ సమూహం ప్రపంచ జనాభాలో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వాటాను కలిగి ఉందని పేర్కొన్నారు. "గ్లోబల్ సౌత్‌లో 100కు పైగా దేశాలు ఉన్నాయి. కానీ ఇక్కడ గ్లోబల్ సౌత్‌కు చెందిన 11 కీలక దేశాలు ఉన్నాయి. ఇవి ఆ దేశాల విభిన్న అభిప్రాయాలకు సమష్టిగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయి" అని థరూర్ తెలిపారు. ఈ కూటమి ప్రపంచ జనాభాలో మెజారిటీ వాటాను, గ్లోబల్ జీడీపీలో 41 శాతం వాటాను కలిగి ఉందని, కాబట్టి ప్రపంచ దేశాలు దీనిని చాలా సీరియస్‌గా తీసుకోవాలని ఆయన అన్నారు. సభ్య దేశాల అధినేతలు, పరిశీలకులు ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా ప్రపంచంలోని కీలక దేశాలను ఒకే వేదికపైకి తీసుకురాగల భారత్ సామర్థ్యం ప్రదర్శితమవుతుందని థరూర్ చెప్పారు. ఇది దేశానికి గర్వకారణమని, ప్రపంచ వేదికపై భారత్‌కు ఉన్న 'దౌత్యపరమైన సమావేశ శక్తి'కి ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'ఎన్డీటీవీ' కథనం ప్రకారం.. బ్రిక్స్ కూటమిలో భాగస్వామ్యం వల్ల భారత్‌కు లభించిన ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలేమిటని చిదంబరం సందేహాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో థరూర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నేటి నుంచి రెండు రోజుల పాటు 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు భారత్‌లో జరగనుంది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు కొత్తగా చేరిన ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మొత్తం 11 అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి. "స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే థీమ్‌తో 2026 సంవత్సరానికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. ఈ సదస్సు ద్వారా బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాలలో మౌలిక సదుపాయాలు, ఇంధనం, డిజిటల్ రంగాల్లోని ప్రాజెక్టులకు నేరుగా నిధులు సమకూర్చే వేదికను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## మూసీ ప్రక్షాళనపై కొత్త ట్విస్ట్..
## రేవంత్ సర్కార్‌కు ఎన్జీటీ నోటీసులు!

మొదటి పేజి తరువాయి

మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు, అనుమతుల విషయంలో లోపాలున్నాయని అప్పీల్‌దారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఇచ్చిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ వారు ఎన్జీటీని ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారం మరోసారి న్యాయస్థానం ముందుకు వచ్చింది. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే స్టడీ చేశారు. అలాగే ఈ రీజియన్‌లోనే మృగవాణి నేషనల్ పార్క్ ఉంది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సమీపంలో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయంతో పాటు వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నోటీసులు

అప్పీల్‌ను పరిశీలించిన చెన్నై ఎన్జీటీ బెంచ్.. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను, సంబంధిత వివరాలను ట్రిబ్యునల్ ముందు ఉంచాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన ఒక పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. దీంతో ప్రాజెక్టుకు అప్పట్లో ఊరట లభించింది.

వచ్చే నెల 16న విచారణ

తాజాగా రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను ఎన్జీటీ వచ్చే నెల 16కు వాయిదా వేసింది. దీంతో ఆ రోజు జరిగే విచారణలో పర్యావరణ అనుమతులపై అప్పీల్‌దారులు లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా నది ప్రక్షాళనతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి, మురుగునీటి సమస్య పరిష్కారం వంటి చర్యలను ప్రభుత్వం చేపడుతోంది. అయితే ప్రాజెక్టు పర్యావరణ ప్రభావం, అనుమతుల ప్రక్రియపై మొదటి నుంచీ వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఎన్జీటీలో దాఖలైన అప్పీల్‌తో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## మా జుట్టు పట్టుకుని లాగారు
## - ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

మొదటి పేజి తరువాయి

శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు తమ పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. "మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ పోలీసులు అరాచకం సృష్టించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, కుట్రలో భాగంగానే జరిగింది" అని ఆమె పేర్కొన్నారు. తమను రక్షించేందుకు ప్రయత్నించిన తోటి ఎమ్మెల్యేలను సైతం పోలీసులు తోసివేసి కిందపడేసి తొక్కారని, ఈ ఘటనలో జగదీశ్‌రెడ్డికి రక్తపోటు పెరిగిందని, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని వివరించారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా తమను అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు.

## రేవంత్ సీఎం అవడం..
## వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

మొదటి పేజి తరువాయి



భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర..
## మహిళా అధికారుల ముందు
## అభ్యంతరకరంగా వ్యవహరించారు: రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు. చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

## బ్రిక్స్ సదస్సు సందర్భంగా
## పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

ఢిల్లీ,: బ్రిక్స్ సదస్సు-2026 నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, పుతిన్‌కు ఒక విశిష్టమైన సాంస్కృతిక కానుకను అందజేశారు. ప్రాచీన తమిళ సాహిత్య గ్రంథమైన 'తిరుక్కురళ్' రష్యన్ అనువాద ప్రతిని ఆయనకు బహూకరించారు. సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు ఎంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. పరస్పరం కరచాలనం చేసుకుని, ఆలింగనం చేసుకున్నారు. ఈ భేటీలో పలు అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై వారు కూలంకషంగా చర్చించినట్లు సమాచారం.

ఏమిటీ తిరుక్కురళ్?

ప్రధాని మోదీ బహూకరించిన 'తిరుక్కురళ్' తమిళ సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్య, గౌరవం పొందిన గ్రంథాల్లో ఒకటి. దీనిని సుప్రసిద్ధ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ రచించారు. ఇందులో నీతి, నైతికత, ప్రేమ, సంపద, పాలన, మానవ ప్రవర్తన వంటి అనేక అంశాలపై 1,330 పద్యాలు ఉన్నాయి. ఈ గ్రంథం అర్థవంతమైన, నైతిక జీవితాన్ని ఎలా గడపాలో తెలియజేసే మార్గదర్శిగా ప్రసిద్ధి చెందింది. ఇందులోని అంశాలు సార్వత్రికమైనవి కావడంతో, భాష, సంస్కృతి, దేశాల సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. ఇప్పటికే అనేక ప్రపంచ భాషల్లోకి అనువదించబడిన ఈ గ్రంథం రష్యన్ అనువాదాన్ని పుతిన్‌కు అందించడం ద్వారా, విశ్వమానవ విలువలను చాటిచెప్పే భారతీయ సాహిత్య వారసత్వాన్ని నరేంద్ర మోదీ ఆయనకు పరిచయం చేసినట్టయింది.

## ఓటర్ల జాబితా సవరణ: సమంత, విజయ్ దేవరకొండ,
## వీవీఎస్ లక్ష్మణ్ సహా ప్రముఖులకు నోటీసులు

హైదరాబాద్, : కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించారు. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం ధ్రువీకరణ ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా సాగుతోంది. కర్ణాటకలోనూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులే అందాయి. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.

## పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి
## - కలెక్టర్లకు మంత్రి లోకేశ్ ఆదేశం..

మొదటి పేజి తరువాయి



విద్యా ప్రమాణాల పెంపుతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా కలెక్టర్లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై వారికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. పాఠశాల భవనాలు పటిష్టంగా ఉండటంతోపాటు, నూతన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను వివిధ పరిశ్రమలతో అనుసంధానిస్తూ, వాటికి అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు 'నైపుణ్యం' వెబ్ పోర్టల్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలతోపాటు అవసరమైన స్కిల్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి వెల్లడించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, యువత మధ్య సమన్వయం పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలను మరింత విస్తృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు, ఏపీలో అక్షరాస్యత పెంపుతోపాటు డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీపైనా విద్యాశాఖ దృష్టి సారించిందని లోకేశ్ తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వీయ రక్షణ చర్యలపైనా పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కరిక్యులమ్ మార్పుపై ఇప్పటికే రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్యార్థుల్లో భవిష్యత్ నైపుణ్యాలను పెంపొందించేలా విద్యా విధానంలో అవసరమైన మార్పులు చేపడుతున్నామని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం
## బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత

మొదటి పేజి తరువాయి

ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం..
## రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

మొదటి పేజి తరువాయి

ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..
## ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

మొదటి పేజి తరువాయి



ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో సమస్యల పరిష్కారం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు. సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.

గ్రామ, వార్డు సిబ్బందికి జాబ్ ఛార్ట్

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

## గల్వాన్ తర్వాత మారుతున్న సీన్..
## మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన



ఢిల్లీ,: ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు. మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారు. గతంలో 2025 ఆగస్టులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విమాన సర్వీసులు, వీసాలు, ఉన్నతస్థాయి సంబంధాలు కూడా క్రమంగా పునరుద్ధరించుకుంటున్నాయి. బ్రిక్స్ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా తెలిపింది. అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిక్స్ భవిష్యత్ అభివృద్ధి, పరస్పర సహకారంపై జిన్‌పింగ్ ఇతర దేశాల నేతలతో చర్చించనున్నారు. బ్రిక్స్‌ను 2009లో ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మరిన్ని దేశాలు ఉన్నాయి.

# కోతులు బాబోయ్ గ్రామంలో కోతుల భయం

**పట్టించుకునే నాధుడే లేరా**

**కోతుల బెడద నుంచి గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం దొరకదా**



కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 11 నేటి శుభోదయ: గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కోతుల బెడద రోజురోజుకు తీవ్రంగా మారుతోంది. గ్రామంలో సంచరిస్తున్న కోతులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల పైకప్పులపైకి ఎక్కడం, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, చిన్నారులు, మహిళలు, వృద్ధులను వెంబడించడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో గ్రామంలో ప్రజలు భయాందోళనల మధ్య సంచరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కోతుల బెడద నుంచి గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేలా అటవీ శాఖ, పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.




# వివేకానందుని స్ఫూర్తితో నవభారత నిర్మాణానికి నాంది పలకాలి



మాచర్ల రూరల్: సెప్టెంబర్ 11; నేటి శుభోదయ మాచర్ల మండలం: స్వామి వివేకానందుని ఆశయాలు, బోధనలు, నైతిక మరియు ఆధ్యాత్మిక విలువలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగోలో ప్రపంచ మత మహాసభలో చారిత్రాత్మక ప్రసంగం చేసిన రోజును పురస్కరించుకొని శుక్రవారం మాచర్ల మండలం కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు నైతిక, ఆధ్యాత్మిక విలువలపై పరీక్ష నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'వివేకానంద ఫర్ యూత్' పుస్తకం ఆధారంగా విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ, చికాగోలో స్వామి వివేకానంద తన ప్రసంగాన్ని 'అమెరికా దేశపు సోదర సోదరీమణులారా' అంటూ ప్రారంభించగానే సభికులు రెండు నిమిషాల పాటు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. ప్రపంచంలోని ప్రతి ఒక్కరినీ సోదర సోదరీమణులుగా భావించి మానవతా దృక్పథంతో జీవించాలని వివేకానందుడు సందేశమిచ్చారని పేర్కొన్నారు. సర్వమత సామరస్యం, సర్వమానవాళి శ్రేయస్సు అనే ప్రధాన అంశాలను తన ప్రసంగాల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. వివేకానందుడి ప్రసంగంతో భారతదేశంపై అప్పటివరకు ప్రపంచ దేశాల్లో ఉన్న అనేక అపోహలు తొలగిపోయాయని గోవిందరెడ్డి తెలిపారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడిగా స్వామి వివేకానంద చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. విద్యార్థులు స్వామి వివేకానందుని జీవితాన్ని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని దేశానికి సేవ చేయాలని సూచించారు. ఆయన కలలుగన్న నవభారత నిర్మాణానికి నేటి యువత నాంది పలకాలని పిలుపునిచ్చారు. నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, మానవతా 8దృక్పథాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని కోరారు. అనంతరం 'వివేకానంద ఫర్ యూత్' పుస్తకం ఆధారంగా విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సైదమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గంలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం

**ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి**

**మాజీ ఎంపీ రంగయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ**




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 నేటి శుభోదయ: మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హాజరైన నియోజకవర్గ పరిశీలకులు మహిందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంత కామెంట్స్ గతంలో మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఇదే టీడీపీతో పోరాడి గట్టిగా పోరాటాలు చేసి అభ్యర్థులను గెలిపించుకున్నాం. పార్టీకి నిబద్ధులై, క్రమశిక్షణగా ఉన్న అభ్యర్థులను బరిలో దింపి వాళ్ళ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయండి. ఉన్నోడు మాత్రమే గెలుస్తాడు అనే అపోహను వీడండి. ప్రజల వద్దకు వెళ్లి కూటమి అవినీతి, అరాచకాలను తెలియజేయండి. ఈ ప్రభుత్వం వచ్చాక కరెంట్ చార్జీలు పెంచినప్పుడు, రైతన్నల కోసం, విద్యార్థుల కోసం, ఆర్డీటీ కోసం.. ప్రజలకు ఏ కష్టం వచ్చినా మనం అండగా నిలబడ్డాం. ఇక ఎన్నికలు ఆలస్యం చేస్తే ఉన్నవి కూడా పోతాయి అనే ఆలోచనలో కూటమి నేతలు ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనమంతా సిద్ధంగా ఉందాం. అరాచక పాలన నుండి రక్షించుకోవాలి అంటే కలిసికట్టుగా పని చేసి మన అభ్యర్థులను గెలిపించుకోవాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండేళ్లలో 5 లక్షల పింఛన్ లు తీసేశారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని కొత్త పింఛన్ల పేరుతో నాటకాలు ఆడుతున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూడా దోపిడీ పాలన సాగుతోంది. ప్రజాప్రతినిధులు ఇంత నీచంగా దిగజారిపోతారా అంటూ ప్రజలే చెప్పుకుంటున్నారు. మనం ఐక్యమత్యంతో పని చేస్తే కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాలలో పాటు, మున్సిపాలిటీను కూడా కైవసం చేసుకుంటాం. గతంలో మన చేసిన అభివృద్ధి, సంక్షేమం చెప్పుకోలేక ఓడిపోయాం.. మాజీ ఎంపీ కళ్యాణ్ దుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య కామెంట్స్ :పోరాటాలు మనకు కొత్త కాదు.. గొంచితండాలో మొదలు పెట్టి ఢిల్లీ వరకు తెలిసేలా ఆర్డీటీ కోసం పోరాటం చేశాం. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి లేదు.. కొండ మొదలు గుట్ట వరకు ఏది వదలకుండా దోచేస్తున్నారు. నియోజకవర్గంలో ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? నియోజకవర్గంలోని చెరువులకు నీరు ఇచ్చే వరకు పోరాడుదాం. కష్టపడే ప్రతి కార్యకర్తలకు న్యాయం చేస్తాం. నియోజకవర్గంలోని అన్ని ఊర్లలో బెల్ట్ షాపులు, ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇదే కూటమి అభివృద్ధి. క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసే అభ్యర్థులను స్థానిక ఎన్నికల బరిలో నిలిపి గెలిపించుకుందాం.

# ఇస్కాన్‌కు రూ.5 లక్షలు.. సాయి బాబా గుడికి రూ.1 లక్ష.. జొన్నలగడ్డ దంపతుల విరాళం



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 నేటి శుభోదయ : శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబ శివారెడ్డి దంపతులు భక్తి, దాతృత్వాన్ని చాటుకున్నారు. అనంతపురం సమీపంలోని సోములదొడ్డి వద్ద ఉన్న ఇస్కాన్ ఆలయానికి గతేడాది రూ.1 లక్ష, ఈ ఏడాది రూ.4 లక్షలు, అనంతపురం రెండో రోడ్డులోని సాయిబాబా ఆలయానికి రూ.1 లక్ష చొప్పున విరాళంగా అందించారు. మొత్తంగా రూ.6 లక్షల విరాళాన్ని అందజేశారు. ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణుడు, రాధారాణి దివ్య మూర్తులను దర్శించుకుని జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సాయి బాబా ఆలయానికి వెళ్లి సాయి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడం సంతోషంగా ఉందని జొన్నలగడ్డ దంపతులు తెలిపారు. భక్తి, సేవా కార్యక్రమాల్లో తమ వంతు భాగస్వామ్యం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబ శివారెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

**వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి**

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపు.**

**గ్రామస్థాయి నుంచి సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారిని గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలి**

**"ఇవి సాధారణ ఎన్నికలు కావు.. కచ్చితంగా గెలవాల్సిన ఎన్నికలు" అని కార్యకర్తలకు దిశానిర్దేశం**




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 నేటి శుభోదయ : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రాప్తాడు నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి బలమైన, ప్రజలకు అందుబాటులో ఉండే సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. "ఇవి సాధారణ ఎన్నికలు కావు.. మనం కచ్చితంగా గెలవాల్సిన ఎన్నికలు. ప్రతి స్థానంలో సరైన అభ్యర్థిని నిలబెట్టి, గెలిపించి తీసుకురావాలి. అందుకు మీకు మేము పూర్తి అండగా ఉంటాం. మనం ఘన విజయం సాధించి ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడాలి" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. "రైతుల సమస్యలపై ఆందోళన అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న రైతుల సమస్యలపై ప్రకాష్ రెడ్డి గారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేక బోర్లు ఎండిపోవడంతో కరువు తీవ్రరూపం దాల్చిందని, రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీ-నీవా కాలువలకు లైనింగ్ పనులు చేయడం వల్ల వేలాది ఎకరాల భూములు సాగుకు దూరమవుతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేరూరు డ్యామ్‌కు నీటిని అందించకుండా రాప్తాడు నియోజకవర్గ రైతులతో పాటు రొద్దం, పెనుకొండ మండలాల రైతులను కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు. అలాగే ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, భూగర్భ జలాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల భవిష్యత్తులో రైతులు మరింత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. రైతులకు సాగునీరు, విద్యుత్, గిట్టుబాటు ధరలు, కరువు సమస్యల నుంచి ఉపశమనం కల్పించాలంటే ప్రజల తరఫున నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నా.. గ్రామస్థాయిలో ప్రజలకు అండగా నిలవాలన్నా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాల్సిన అవసరం ఉందని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు.



# జగ్గంపేటలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె - నిరసన శిబిరం




కాకినాడ జిల్లా జగ్గంపేట సెప్టెంబర్ 11 నేటి శుభోదయ: యు ఎఫ్ బి యు పిలుపు మేరకు ఈరోజు దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా జగ్గంపేట సర్వీస్ రోడ్ లోని భారతీయ స్టేట్ బ్యాంకు గృహ రుణ కేంద్రం వద్ద ఉన్న శ్రీ కాంప్లెక్స్ నందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, ఐదు రోజుల బ్యాంకింగ్ అమలు, ఏకపక్ష పనితీరు ఆధారిత ప్రోత్సాహక విధానం ఉపసంహరణ, పెండింగ్ సమస్యల పరిష్కారం మా ప్రధాన డిమాండ్లు అని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమ్మె జరగడానికి ప్రధాన కారణం తమ పట్ల ప్రభుత్వానికి ఉన్న అలసత్వం మరియు ఉదాసీనత అని అన్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం బ్యాంకు సంఘాలకు మరియు భారత బ్యాంకుల సమాఖ్యకు మధ్య ఐదు రోజుల పని దినాల గురించి ఒప్పందం జరిగి, ఆ ఫైలును భారత ప్రభుత్వ ఆమోదానికి పంపడం జరిగిందని, కానీ ప్రభుత్వం ఆ ఫైలును ఇప్పటి వరకు పరిగణలోకి తీసుకోకుండా పక్కన పెట్టడమే ఈరోజు సమ్మెకు ప్రధాన కారణమని తెలిపారు. ఆర్థిక రంగంలో పనిచేస్తున్న అన్ని సంస్థలలో ఐదు రోజుల పని దినాలు అమలులో ఉన్నప్పటికీ, బ్యాంకులకు ఆ నిబంధన వర్తింప చేయడానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. పదే పదే వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఆ అంశం పట్ల ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని, దీనికి నిరసనగా ఈరోజు సమ్మె చేస్తున్నామని తెలిపారు. అలానే విభజించు పాలించు అన్నట్లు పనితీరు ఆధారిత ప్రోత్సాహకం విషయంలో ఉద్యోగుల పట్ల అసమానత్వం ఉండేలా చర్యలు తీసుకుని, తమ ఐకమత్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం కూడా ఈరోజు సమ్మెకు కారణమని అన్నారు. అలాంటిది ఉద్యోగుల పట్ల, కష్టపడి పనిచేసే క్షేత్ర స్థాయి ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరియు భారత బ్యాంకుల సమాఖ్య మొండి వైఖరి వీడి, తమ డిమాండ్లకు సానుకూలంగా స్పందించాలని, లేకపోతే ఈ నెల 28 నుండి 30 వరకు మూడు రోజుల సమ్మెకు మరియు అక్టోబర్ 11 నుండి నిరవధిక సమ్మెకు ఇప్పటికే పిలుపు ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వం మెడలు వంచే విధంగా రాబోయే సమ్మెలు మరింత ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు కలిగే ఇబ్బందులకు చింతిస్తున్నామని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాలు సానుకూలంగా పరిష్కరించాలని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలోభారతీయ స్టేట్ బ్యాంక్ తుని రీజియన్ -రీజినల్ సెక్రటరీ లోడా విజయ్ బాబు, ఆఫీసర్స్, బ్యాంకు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# "బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం భారీ ర్యాలీ"




తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 11 (నేటి -శుభోదయ) బ్యాంక్ ఉద్యోగులకు ఐదురోజుల పనివారం అమలు చేయాలని ఖాళీలు భర్తీ చేయాలని , తమ అపరిష్కృత సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె తాడేపల్లిగూడెంలో సంపూర్ణంగా విజయవంతం అయ్యింది. అధికారులు, ఉద్యోగులు పూర్తిగా సమ్మెలో పాల్గొనడంతో బ్యాంకులన్నీ మూతపడ్డాయి. పట్టణంలో పరిసర గ్రామాల్లో బ్యాంకింగు కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. సమ్మెలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కే.ఎన్.రోడ్డు లోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ కార్నర్ వద్దకు ఉదయం పది గంటలకే చేరుకున్నారు. బ్యానర్లు, ప్లే కార్డులు, యూనియన్ పతాకాలు చేబూనిన సిబ్బంది పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఉద్యోగుల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. మహిళా ఉద్యోగులు సైతం పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి తోట సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజులు పనిదినాలు అమలు చేస్తామంటూ ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ ఉద్యోగ సంఘాలతో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం అంగీకరించిన అంశాన్ని అమలు చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని స్పష్టం చేశారు. దేశంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటి లోనూ, ప్రైవేట్ కంపెనీలలోనూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్ , మనీ మార్కెట్, ఫారెన్ ఎక్స్చేంజ్ మార్కెట్ వంటి సంస్థల్లో ఐదు రోజుల పనివారం అమలులో ఉండగా, బ్యాంకు ఉద్యోగులకు అదే సదుపాయాన్ని కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి సోమసుందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికే కుట్ర చేస్తున్నదన్నారు. విదేశీ బ్యాంకులను అనుమతించడం, బడా పారిశ్రామిక సంస్థల రుణాలను మాఫీ చేయడం వంటి చర్యలు ప్రభుత్వ రంగ బ్యాంకులను దెబ్బతీయడమేనని అన్నారు. ఆటోమేషన్ తో ఉద్యోగులపై పనిఒత్తిడి తగ్గాల్సింది పోయి పనిభారం పెరిగిపోయిందని, రాత్రి పొద్దుపోయేవరకు సిబ్బంది బ్యాంకుల్లోనే పనిచేయాల్సి వస్తోందని, వారి పని మొత్తం ఆర్థిక లావాదేవీలు కావడంతో సిబ్బంది మానసిక ఆరోగ్యాలు కూడా దెబ్బ తింటున్నాయని సోమసుందర్ అన్నారు. వెంటనే బ్యాంకుల్లో ఖాళీలు భర్తీ చేయాలని సోమసుందర్ డిమాండ్ చేశారు. వివిధ బ్యాంకు యూనియన్లకు చెందిన యు.ఎఫ్.బి.యు. నాయకులు మాట్లాడుతూ భద్రత లేని కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేయాలనీ , బ్యాంకు ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రిటైర్ అయిన ఉద్యోగు లందరికీ ఒకే విధమైన డిఏ ఫార్ములా ఉండాలని , రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులకు గ్రాట్యూటీ సీలింగ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ పి.రాంప్రసాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ డి.శ్రీధర్, ఎస్.బి.ఐ.సిబ్బంది సంఘం నాయకులు మానుకొండ కిరణ్ , యూనియన్ బ్యాంకు నాయకులు దివ్య, రజనీ, యూనియన్ బ్యాంకు సిబ్బంది సంఘం నాయకులు లింగంపల్లి గాంధీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ కార్యదర్శి ఏడుకొండలు, ఆర్బివో అధికారుల సంఘం కార్యదర్శి సి.హెచ్. రామలింగేశ్వరరావు, ఎస్.బి.ఐ.సిబ్బంది సంఘం నాయకులు పవన్ కుమార్, మనోజ్ తదితరులు మాట్లాడారు. సమ్మె చేస్తున్న బ్యాంకు ఉద్యోగులకు భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, హార్టీకల్చర్ యూనివర్సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోటుం నాగేశ్వరరావు, కార్యదర్శి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో

# అనంతపురం జిల్లాకు సక్షం అవార్డు




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 04 నేటి శుభోదయ : యునైటెడ్ సంస్థ 2030 నాటికి 95-95-95 లక్ష్యాలను సాధించాలని సభ్య దేశాలకు లక్ష్యంగా నిర్ణయించింది. 1. మొదటి 95: జిల్లాలో హెచ్. ఐ. వి తో జీవిస్తున్న వారిలో 95 శాతం మందిని గుర్తించటం. 2. హెచ్. ఐ. వి ఉందని గుర్తించిన వారిలో 95 శాతం మందికి చికిత్స అందించటం, 3. హెచ్ఐవి కొరకు చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరస్ అణిచివేయబడడం ఆ క్రమంలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లాలు సాధించిన ప్రగతి ఆధారంగా జిల్లాలను సంఘర్షశీల్, సక్షం, సురక్షిత్, సురక్షిత్ ప్లస్ గా విభజించింది. జిల్లాల వారీగా సాధిశించిన ప్రగతిని ఈ నెల 8 వ తారీఖు నాడు ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టరు స్మరణ్ రాజ్ ఐఎఎస్ విజయవాడలో నిర్వహించిన సమావేశంలో సమీక్షించి, సంఘర్షశీల్‌లి స్థితి నుండి సక్షంస్తితి కి చేరిన అనంతపురం జిల్లాను అభినందించి జ్ఞాపిక అందచేశారు. ఈ సందర్భంగా ఈ రోజు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ని వారి ఛాంబరులో జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ జయలక్ష్మి , ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, సి పి ఓ రమణ కలసి ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం లో జిల్లా సాధించిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన డి ఎం హెచ్ ఓ, జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది మరింత మెరుగ్గా పనిచేసి ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలలో మరింత పురోగతి సాధించాలని సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేస్తాం

**వడ్డి రఘురామ్ నాయుడు**

తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 11 (నేటి- శుభోదయ) తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక సంస్థలు ఎన్నికల సన్నాహాలపై నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం స్థానిక జెమినీ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. క్రొత్తగా ఐడీ కార్డులు మంజూరైన వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వెన్నుపోటు పార్టీ వెన్నుపోటు పాలన కార్యక్రమం ద్వారా గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు వివరించారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వక్తలు మమాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను బలంగా ఎదుర్కొందామన్నారు. ప్రతిపక్షం మనకు కొత్త ఏమీ కాదని, 2014లో మన పార్టీ గెలవకపోయినా, ఎవరూ అధైర్యపడలేదన్నారు. కలిసికట్టుగా పనిచేసి 2019లో విజయం సాధించామని, వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. కుల, మత, ప్రాంత, రాజకీయాలు చూడకుండా పథకాలు అందజేశామన్నారు. ప్రజా సేవే పరమావధిగా పని చేశామని,. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని, కానీ




ఐదేళ్లలో మనం చేసిన మంచిని బలంగా చెప్పుకోలేకపోయామన్నారు. ఐదేళ్ల వైయస్ఆర్ సీపీ పాలనలో కొన్ని విషయాల్లో మనం వెనుకపడ్డామన్నారు. భవిష్యత్‌లో అలాంటి పరిస్థితి రాకుండా చూసుకుందామన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తే అధినేత అని, ఈ విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని, కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని ముందుకు వెళున్నారన్నారు. రెండేళ్ల పాలన అవినీతి నిలయంగా మారిపోయిందన్నారు. మట్టి, ఇసుక, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోందన్నారు. స్థానిక ఎన్నికల్లో తప్పకుండా గెలవాలన్నారు. అందరూ ఐక్యమత్యంగా ఉందామని, పార్టీ నియమించిన అభ్యర్థులను గెలిపిద్దామని కలిసికట్టుగా గ్రామాల్లో అధికార పార్టీని ఎదుర్కొందామన్నారు. బహుశా అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఎన్నికలు ఉంటాయని,. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా ప్రతినిధుల అవినీతితోపాటు సూపర్ సిక్స్ సహా 143 హామీలపై నిలదీద్దామన్నారు.. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు, కూటమి పరిపాలన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిద్దామన్నారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని, డీఎస్సీలో జరిగిన అక్రమాలు రోజుకొకటిగా బయటపడుతుంటే, అనర్హులే గురువులుగా నియమితులయ్యారని ప్రభుత్వం రహస్య విచారణలతోనే తేల్చేస్తోందన్నారు.. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు రిజర్వేషన్లతో నడిపిన మెగా డీఎస్సీ పూర్తిగా అక్రమాల పుట్టగా మారిపోయిందన్నారు. నీట్ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకున్నట్లుగానే, రాష్ట్రంలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ లోకేష్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. దేశంలోనే అత్యంత అవినీతిమయమైన పాలనను చూస్తున్నామన్నారు. 2025 ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి పోస్టింగులు ఇచ్చే వరకు ప్రతి అడుగునా అడ్డగోలు అవకతవకలకు పాల్పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ స్థాయి నాయకులు పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, పెంటపాడు మండల అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షులు చిట్టూరి బాపన్న, ఎంపీపీ గూడూరు రూరల్ ఎంపీపీ శేషులత, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, మరియు పట్టణ,మండల, నాయకులు, ఎంపీపీలు,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు..

## ఇంటింటి సర్వే ను ప్రారంభించిన డీ యల్ ఏ టీ ఓ జయలక్ష్మి



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 నేటి శుభోదయ : కుష్టు వ్యాధి నిర్మూలన లో భాగంగా ఈ రోజు 11 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు జరుగు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని అనంతపురము నగరంలో నాయక్ నగర్ నగర ఆరోగ్య కేంద్రం నందు జిల్లా లెప్రసీ,ఎయిడ్స్ , టీబీ వ్యాధి అధికారి డాక్టర్ జయలక్ష్మి, స్థానిక వైద్య అధికారి డాక్టర్ సుకుమార్ రెడ్డి ఇంటింటి సర్వే ప్రారంభించారు .ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ ఎల్ సి డి సి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ,దాగి ఉన్న, కుష్టు వ్యాధి సోకిన ప్రతి కేసు ను ఈ సర్వే ద్వారా గుర్తించి వైద్యం అందించాలని తెలిపారు, అలాగే కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తులు ను గుర్తించి దగ్గరిలోని ఆసుపత్రులకు పంపించాలి అని తెలిపారు, కుష్టువ్యాధి ఒక సాధారణ వ్యాధి అని, ఈ వ్యాధి లక్షణాలలో ముఖ్యంగా శరీరము పై స్పర్శ లేని తెల్లటి, రాగి రంగు మచ్చలు మరియు నరాలు పై ప్రభావం చూపుతాయని తెలిపారు. ముఖ్యంగా ఈ వ్యాధి యం డి టి వైద్యం తో ఏ దశ లో అయినా నయం అవుతుందని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు అందుబాటులో ఉన్నాయని ఉచితంగా అందిస్తారని తెలిపారు ,కావున వ్యాధి సోకిన వారు భయపడ వలసిన అవసరం లేదని తెలిపారు .ఈ కార్యక్రమం లో పారామెడికల్ అధికారి నాగన్న, ఆరోగ్య విద్యా అధికారి గంగాధర్ , డి పి యం ఓ తిప్పేస్వామి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్ఠువ్యాధి నిర్మూలన మన బాధ్యత '
## రాష్ట్ర శాంపిల్ సర్వే అసెస్మెంట్ టీం డా. సంపత్



మెదక్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ ::: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, మెదక్ లో లెప్రసీ నోడల్ ఆఫీసర్లకు కుష్ఠువ్యాధి పై అవగాహన కార్యక్రమాని శుక్రవారం నిర్వహించారు.జిల్లాలో కుష్టువ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూపర్వైజరీ స్టాఫ్, ఏ.ఎన్.ఎం.లు, ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అనుమానిత కుష్ఠువ్యాధి లక్షణాలు గల వ్యక్తులను గుర్తించి, డాక్టర్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి త్వరితగతిన మందులు వాడించడం ద్వారా కుష్టువ్యాధి పూర్తిగా నయం అవుతుందని, నిర్లక్షం చేస్తే అంగవైకల్యం బారిన పడవచ్చని రాష్ట్ర శాంపిల్ సర్వే అసెస్మెంట్ టీం డా. సంపత్ తెలిపారు. జిలా కుష్టువ్యాధి నివారణ అధికారి డా. హరిప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ప్రణాళికతో కుష్టువ్యాధి నిర్మూలన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటికి సర్వే నిర్వహించామని, అనుమానిత లక్షణాలు గల వారిని గుర్తించి, డి.పి.ఎం.ఓ.లు వారిని క్షుణ్ణంగా పరిశీలించి, డాక్టర్ ద్వారా మరల పరీక్షలు చేయించి చికిత్సలు మొదలు పెడుతున్నామని తద్వారా జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలనలో ఆరోగ్యాశాఖ సిబ్బంది చురుగ్గా పనిచేస్తున్నారని ఎతెలిపారు.కార్యక్రమంలో పి.ఎం.ఓ. శంకర్ రాఠోడ్, డిప్యూటీ పార మెడికల్ అధికారులు వెంకటేశ్వర చారి, శ్రీనివాస్, సంతోష్, వివిధ పి.హెచ్.సి.ల నుండి లెప్రసీ నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఉదయం పూట రాష్ట్ర శాంపిల్ సర్వే మరియు అసెస్మెంట్ టీం మెదక్ జిల్లాలోని మనోహరాబాద్, శివంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

## మల్లవరంలో తాగునీటి కష్టాలు
## పాడైన మోటార్లు.. ఎండిపోయిన బోర్లు



రెంటచింతల మండలం: ఆర్ సి ఇంచార్జి సెప్టెంబర్ 11 ; నేటి శుభోదయ : మల్లవరం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గ్రామంలోని పలు బోర్లు ఎండిపోవడంతోపాటు, నీటి సరఫరా చేసే మోటార్లు పాడైపోయాయి. దీంతో గ్రామస్థులు రోజువారీ అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలో ఉన్న కొద్దిపాటి నీటి వనరులపై ఆధారపడుతున్న ప్రజలకు ప్రస్తుతం తాగునీరు అందడం కష్టంగా మారింది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు దూర ప్రాంతాలకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. కొందరు గ్రామస్థులు ప్రైవేటు వాహనాల ద్వారా నీటిని కొనుగోలు చేస్తుండటంతో అదనపు ఆర్థిక భారం పడుతోంది.నీటి సమస్యపై గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడైన మోటార్లను వెంటనే మరమ్మతు చేయడంతోపాటు, ఎండిపోయిన బోర్లకు ప్రత్యామ్నాయంగా కొత్త బోర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.అత్యవసరంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి, వేసవి కాలం పూర్తయ్యే వరకు గ్రామంలో నిరంతర తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## రైతు కూలీ సంఘం, న్యూ డెమోక్రసీ పార్టీ,
## ముఖ్యమంత్రి కి పెట్టిన దరఖాస్తుకు స్పందన

**– ఉద్యానవన శాఖలో ఉన్న రాయితీలను వినియోగించుకోండి**



చింతూరు, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ ::: న్యూ డెమోక్రసీ పార్టీ పోలవరం జిల్లా సెక్రెటరీ కుంజా దూలయ్య ముఖ్యమంత్రి కార్యాలయానికి జీడి మామిడి, పసుపు రైతులను ఆదుకోవాలని చేసిన విజ్ఞప్తి మేరకు కార్యాలయం స్పందించింది. ఐటీడీఏ ద్వారా పసుపు,జీడి మామిడి రైతులకు భూమి అభివృద్ధి చేసుకోవడానికి 20వేల వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఉద్యానవన శాఖ స్పందించి ఇప్పటికే వివిధ కార్యక్రమాలు ఘననీయమైన రాయితీలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కొత్త జీడి మామిడి తోటల ఏర్పాటు కు ఉద్యానవన శాఖ ద్వారా అర్హత కలిగిన రైతులకు తోటల అభివృద్ధికి మొక్కలు ఏర్పాటు చేయడం కోసం 30 వేల వరకు రాయితీ ఉందని తెలియజేశారు. అలాగే 50 శాతం రాయితీలు గరిష్టంగా 24 వేల రూపాయలు వరకు పాత జీడి మామిడి తోటలు అభివృద్ధి చేసుకోవడానికి అందించబడుతుందన్నారు. అలాగే 50 శాతం రాయితీతో పవర్ టిల్లర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు ఇతర వ్యవసాయ పరికరాలు అందించబడతాయని తెలిపారు. జీడి మామిడి తోటలో కలుపు నియంత్రణ తుప్పర తొలగించడానికి వ్యవసాయ పనులు సకాలంలో చేపట్టడానికి వివిధ రకాల యంత్ర పరికరాలు రైతులకు ఎంతో ఉపయోగమని తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా అందుబాటులో ఉన్న రాయితీలను రైతుల సద్వినియోగం చేసుకుంటూ చర్యలు తీసుకోవడంతో పాటు ఐటీడీఏ ద్వారా ప్రతిపాదించిన వడ్డీ లేని రుణాన్ని పరిశీలించబడతాయని తెలిపారు. ఈ మేరకు రైతులతో ఉద్యానవన శాఖ చర్చలు జరిపారని, చర్చల అనంతరం జీడి మామిడి తోటల పునరుజ్జీవనం కోసం ఆర్ ఓ యఫ్ ఆర్ పట్టాలో వున్న హేక్టర్ భూమికి 54వేలు, 1బి పట్టాలో వున్న భూములకు24వేలు చెల్లించ నున్నట్లు ఒప్పందం జరిగినట్లు, ఈ అవకాశాన్ని సాగుదారులు ఉపయోగించుకోవాలని న్యూ డెమోక్రసీ పోలవరం జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎయిడ్స్ బాధితులపై ముఖ్యమంత్రి గారు మానవతా దృక్పథంతో స్పందించాలి

**అర్హత కలిగిన వ్యాధిగ్రస్తులందరికీ నెలకు 4,000 సామాజిక భద్రతా పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి పాటంశెట్టి సూర్యచంద్ర. ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి**



కాకినాడ జిల్లా, సెప్టెంబర్ 11 నేటి శుభోదయ: ఎయిడ్స్ జీవిస్తున్న వ్యక్తుల జీవన పరిస్థితులను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, వారికి సామాజిక భద్రత కల్పించేందుకు నెలకు 4,000 పెన్షన్ అందించాలని కోరుతూ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ఈమెయిల్, ఆన్లైన్ పి జి ఆర్ ఎస్, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వినతిపత్రం సమర్పించామని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు ఎతో జీవిస్తున్న వారు అనేక సందర్భాల్లో ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు, ఉపాధి సమస్యలు, సామాజిక వివక్ష వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని క్రమం తప్పకుండా ాా=ు మందులు వినియోగిస్తూ, పౌష్టికాహారంతీసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్న వారికి ప్రభుత్వం అందించే సామాజిక భద్రత మరింత బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారుమన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా ప్రతి వ్యక్తికి గౌరవంగా జీవించే హక్కును కల్పించిందని, అలాగే ఆర్టికల్ 41లో ప్రజలకు అనివార్యమైన ఆరోగ్య,ఆర్థిక ఇబ్బందుల సందర్భాల్లో వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ సహాయం/సామాజిక భద్రత కల్పించేందుకు సమర్థవంతమైన భద్రత కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వానికి నిర్దేశించిందని.అందువల్ల ఎ×ఎతో జీవిస్తున్న వ్యక్తులకు సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆదుకుంటూ వారు కూడా సమాజంలో గౌరవంగా జీవించేలా చేయడం ప్రభుత్వ బాధ్యత అని పాటంశెట్టి సూర్యచంద్ర ముఖ్యమంత్రి గారికి రాసిన లేఖలో పేర్కొన్నారు

"రాష్ట్రంలో హెచ్ఐవి బాధితుల సంఖ్య పరిస్థితి ఆందోళనకరం"

ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 3.10 లక్షల మంది ఎ×ఎతో జీవిస్తున్నారని,వారిలో సుమారు 2.38 లక్షల మంది ప్రభుత్వ ఆస్పత్రులలో గల ాా=ు కేంద్రాల ద్వారా చికిత్స పొందుతున్నారని,అయితే చీ= భరోసా పథకం కింద కేవలం సుమారు 40,955 మందికి మాత్రమే నెలకు 4,000 పెన్షన్ అందుతున్న పరిస్థితి ఉందన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధికి చికిత్స పొందుతూ సామాజిక భద్రత పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నవారు ఇంకా సుమారు ఒక లక్ష 90 వేల మంది ఉన్నారన్నారు. ఎ×ఎతో జీవిస్తున్న పేదలకు సామాజిక పింఛన్లు ఇవ్వకపోవడపై ప్రభుత్వం పునరాలోచించాల్సిన సున్నితమైన అత్యవసరమైన అంశం అని సూర్యచంద్ర తెలిపారు ప్రభుత్వానికి ఎయిడ్స్ బాధితుల పక్షాన మా ప్రధాన డిమాండ్లు 1.ప్రభుత్వ కేంద్రాల్లో చికిత్స పొందుతున్న ప్రతి అర్హత కలిగిన వ్యాధిగ్రస్తులకు నెలకు 4,000 సామాజిక భద్రతా పెన్షన్ మంజూరు చేయాలి 2.పెన్షన్ కోసం బాధితులను గ్రామ సచివాలయాలు, కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సులభమైన దరఖాస్తు విధానాన్ని ఏర్పాటు చేయాలి. 3.ాూ



ాూజూ, ఆరోగ్యశాఖ, భరోసా విభాగాల మధ్య సమన్వయం చేసి అర్హత ఉన్న ప్రతి ఒక్క ఎ×ఎ బాధితుడు కూడా పెన్షన్‌కు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలి 4. బాధితుల వ్యక్తిగత ఆరోగ్య వివరాలు బహిర్గతం కాకుండా వారి గోప్యత, ఆత్మగౌరవం కాపాడే విధంగా పెన్షన్ ప్రక్రియను నిర్వహించాలి 5. తో జీవిస్తున్న వారికి ఎదురవుతున్న సామాజిక వివక్షను తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి 6.పెన్షన్ మంజూరులో అనవసరమైన జాప్యం లేకుండా, అర్హులైన వారికి ప్రతి నెలా సకాలంలో ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి7 ఎయిడ్స్ మహమ్మారి విస్తరించకుండా విద్యార్థులకు,యువతకు, ప్రజలందరికీ అవగాహన, చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా చేయాలి "గౌరవ ముఖ్యమంత్రి గారు చొరవ తీసుకోవాలి" ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నూతనంగా వృద్ధాప్య ,వితంతు, వికలాంగు, మొదలగు వివిధ రకాల పెన్షన్లు మంజూరు చేస్తున్న నేపథ్యంలో ఎ×ఎతో జీవిస్తున్న పేదల సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కోరుచున్నాను ఇది రాజకీయాలకు అతీతమైన మానవతా సమస్య వచ్చింది కాబట్టి ఒక మనిషి గౌరవం తగ్గ కూడదు ఎతో జీవిస్తున్నారని వారి కుటుంబ హక్కులు తగ్గ కూడదు వారు కూడా మన సమాజంలో సమాన గౌరవంతో జీవించాల్సిన పౌరులే. వారు తమ ఆరోగ్య, ఆర్థిక సమస్యలను బహిర్గతంగా చెప్పుకోలేరు, సహాయం అడగలేరు వారిలో వారే ఆర్థిక, అనారోగ్య సమస్యలతో కుమిలిపోతున్న దయనీయమైన పరిస్థితులు వేలాది కుటుంబాల్లో ఉన్న పరిస్థితి వాస్తవం. కాబట్టి ముఖ్యమంత్రి గారు ఈ అంశంపై తక్షణమే అధికారులతో సమీక్ష నిర్వహించి,అర్హత కలిగిన ప్రతి ాూ×ం వ్యాధిగ్రస్తులకు 4,000 పెన్షన్ అందించే విధంగా విధానపరమైన నిర్ణయం తీసుకొని ప్రభుత్వ పరంగా ఒక ప్రకటన విడుదల చేసి వారిలో మనోధైర్యం నింపాలని కోరుచున్నాను

## జల ప్రదాతలుగా లావు--జూలకంటి జోడీ..!
## రూ.4,200 కోట్లతో సాగు, తాగునీటి ప్రాజెక్టులు

**ఏడు దశాబ్దాల కలకు కదలిక..**

**మాచర్లలో అభివృద్ధిపై పెరుగుతున్న ఆశలు**

మాచర్ల, : ఆర్ సి ఇంచార్జ్ సెప్టెంబర్ 11; నేటి శుభోదయ : ఎగువ పల్నాడు ప్రాంతం అంటే ఒకప్పుడు బీడుబారిన భూములు, సాగునీటి కోసం ఎదురుచూసే రైతులు, తాగునీటి కోసం ఇబ్బందులు పడే ప్రజలే గుర్తుకొచ్చేవారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని వెంటాడుతున్న తాగు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాచర్ల నియోజకవర్గంలో పలు సాగు, తాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం లభించడంతో అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చొరవతో ప్రాజెక్టులపై ప్రభుత్వ స్థాయిలో కదలిక పెరిగిందని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.



### ఏడు దశాబ్దాల కలకు కదలిక



మాచర్ల నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి తాజాగా మరింత ప్రాధాన్యం లభించింది. రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో వరికపూడిశెలకు చోటు కల్పిస్తూ ఉన్నతస్థాయి సమీక్షలో నిర్ణయం తీసుకోవడం ప్రాజెక్టు పురోగతిపై ఆశలు పెంచింది.పర్యావరణ అనుమతులు, చట్టపరమైన క్లియరెన్సులు, ప్రజాభిప్రాయ సేకరణ తదితర ప్రక్రియలను వేగవంతం చేసి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### రూ.3,227 కోట్లతో వరికపూడిశెల

వెల్దుర్తి మండలం దమ్మర్లగొంది వద్ద వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే మాచర్ల నియోజకవర్గంలోని పలు మండలాలకు సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఈ ప్రాంత నీటి అవసరాలపై 1950లోనే కోస్లా కమిటీ నివేదిక ఇచ్చినట్లు పేర్కొంటున్నారు.2019 ఫిబ్రవరిలో తొలి దశ పనులను రూ.340.26 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అనంతరం ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం రూ.14.05 కోట్లు, పైప్‌లైన్ నెట్‌వర్క్‌కు అవసరమైన భూసేకరణ కోసం రూ.63.14 కోట్లు కేటాయించినట్లు సమాచారం. తొలి దశలో వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, కారంపూడి మండలాల పరిధిలో సుమారు 84,500 ఎకరాలకు సాగునీరు, సుమారు 20 వేల మందికి తాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.అన్ని అనుమతులు పూర్తయితే సుమారు రూ.3,227 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

### తాగునీటి ప్రాజెక్టులకూ ప్రాధాన్యం

సాగునీటి ప్రాజెక్టులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు జల్ జీవన్ మిషన్ కింద సుమారు రూ.800 కోట్ల మేర పనులు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మాచర్ల పట్టణానికి అమృత్ పథకం ద్వారా రూ.153.47 కోట్లతో తాగునీటి ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.గత రెండేళ్లలో తాగునీటి అవసరాల కోసం చేపట్టిన పనులను కలుపుకుంటే నియోజకవర్గంలో తాగునీటి రంగానికి రూ.వెయ్యి కోట్లకు పైగా వ్యయం చేస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

### పారిశ్రామిక రంగంలోనూ కొత్త అడుగులు

సాగు, తాగునీటి ప్రాజెక్టులతో పాటు మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల కల్పనపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వెల్దుర్తి మండలం పట్లవీడు వద్ద సుమారు 500 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం జరుగుతోంది. పార్క్ అందుబాటులోకి వస్తే పారిశ్రామిక కార్యకలాపాలు పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.సాగు, తాగునీరు, పారిశ్రామిక రంగం, మౌలిక వసతులకు సంబంధించిన పలు ప్రాజెక్టులు ఒకేసారి కదలికలోకి రావడంతో మాచర్ల నియోజకవర్గ అభివృద్ధిపై స్థానికుల్లో ఆశలు పెరుగుతున్నాయి. దశాబ్దాలుగా వెనుకబడిన ఎగువ పల్నాడు ప్రాంతానికి ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయం, తాగునీటి వసతులు, ఉపాధి రంగాల్లో గణనీయమైన మార్పు వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## పుట్టపర్తిలో అర్హులైన పేదలకు ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేస్తాం

**అర్బన్ హౌసింగ్ కింద ప్రభుత్వ గృహాలకు అర్హులు దరఖాస్తు చేసుకోండి**

**త్వరలో రూ.2.50 లక్షలతో పీఎంఏవై కింద ప్రభుత్వ పక్కా గృహాలు**

**టీడీపీ హయంలో మంజూరైన టిడ్కో గృహాలను 288 మంది లబ్ధిదారులకు త్వరలో అప్పగిస్తాం. ఈనెల 16లోగా నియోజవర్గంలోఅర్హులైన వారు పెన్షన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 11 నేటి శుభోదయ : పుట్టపర్తి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పుట్టపర్తి టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.పుట్టపర్తి పట్టణ పరిధిలో అర్బన్ హౌసింగ్ కింద ప్రభుత్వ గృహాల కోసం అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు త్వరలో పీఎంఏవై పథకం కింద రూ.2.50 లక్షల వ్యయంతో పక్కా గృహాలు మంజూరు చేసి నిర్మించి అందిస్తామని తెలిపారు.అలాగే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన టిడ్కో గృహాల్లో 288 ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అప్పగిస్తామని వెల్లడించారు. ఆయా గృహ సముదాయాల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు.పెన్షన్లకు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలి..నియోజకవర్గంలో అర్హులైన కొత్త పెన్షన్‌దారులు ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పెన్షన్లు, ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల విషయంలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.అర్హులైన పేదలకు ఇళ్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు.ం

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న
## భక్త రామదాసు 10వ తరం వారసులు



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వారిని వాగ్గేయకారుడు, పరమ భక్తాగ్రేసరుడు అయిన భక్త రామదాసు (శ్రీ కంచర్ల గోపన్న) పదవ తరం వారసులు శ్రీ కంచర్ల శ్రీనివాసరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు.ఇంద్రకీలాద్రికి చేరుకున్న భక్త రామదాసు వారసుల కుటుంబానికి ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ స్వయంగా సాదర స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చెయించారు.శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న అనంతరం, ప్రధానాలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి శాస్త్రోక్తంగా వేద ఆశీర్వచనం అందజేశారు. ఈవో వి.కె. శీనా నాయక్ శ్రీ కంచర్ల శ్రీనివాసరావు దంపతులకు శ్రీ కనకదుర్గమ్మ వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.ఈ సందర్భంగా భక్త రామదాసు వారసులు శ్రీ కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తి పారవశ్యంతో శ్రీరాముని కీర్తిస్తూ సంకీర్తనలతో రామభక్తిని నేల నాలుగు చెరగులా చాటిన భక్త రామదాసు వంశీయులుగా ఉండటం తమ పూర్వజన్మ సుకృతమన్నారు.జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో తమను ఎంతో ఆదరంగా ఆహ్వానించి, అత్యంత గౌరవప్రదంగా స్వయంగా ఆలయ ప్రధాన అధికారి అయిన ఈవో దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేయడం తమ కుటుంబానికి ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక సంతృప్తిని ఇచ్చిందని పేర్కొంటూ దేవస్థాన యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సీతమ్మవారి పాదాల వద్ద వినాయక నిమజ్జన

# ప్రదేశంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గౌరీ సూచనలతో శుక్రవారం ఉదయం సీతమ్మవారి పాదాల వద్ద వినాయక నిమజ్జనం నిర్వహించే ప్రదేశంలో పారిశుధ్య, ప్రజారోగ్య విభాగాల సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు.వినాయక నిమజ్జన కార్యక్రమానికి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున, నిమజ్జన ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రాంగణంలోని వ్యర్థాలను తొలగించడం, పరిసరాలను శుభ్రం చేయడం, చెత్త పేరుకుపోకుండా చూడటం వంటి పారిశుధ్య చర్యలు నిర్వహించారు.నిమజ్జన ప్రదేశంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా, ప్రజారోగ్య పరిరక్షణకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు చేపట్టేలా అధికారులు సిబ్బందికి సూచనలు చేశారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి

# దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-విజయవాడ నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం దావు బుచయ్య కాలనీ, మధురా నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు.సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు.నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు జోనల్ కమీషనర్ కె. ప్రభుదాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మొబైల్ కోర్టులో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ నగరంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠిన చర్యలు కొనసాగిస్తోంది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం సర్కిల్-1 కార్యాలయంలో సంచార న్యాయస్థానం (మొబైల్ కోర్టు) నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, రహదారులపై చెత్తాచెదారం వేయడం, రోడ్లపై పశువులు మరియు పెంపుడు కుక్కలను విచ్చలవిడిగా వదిలేయడం, కాలువల్లో వ్యర్థాలు వేయడం ద్వారా మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించడం, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిని గుర్తించారు.ఈ ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 16 కేసులు నమోదు చేసి నిందితులను మొబైల్ కోర్టులో జడ్జి టి.ఎ.ఎస్.ఎస్.ఆర్.ఎ. రిషిక్ ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన జడ్జి నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించగా, మొత్తం రూ. 4,520/- జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రజారోగ్యానికి హాని కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

రహదారులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, నిబంధనలను పాటించి నగర పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా మొబైల్ కోర్టుల ద్వారా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్లు డి. సోమరాజు, ఎస్.వి.ఎస్. శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎస్సీ పై వైసీపీ దుష్ప్రచారం మానుకోవాలి

- డీఎస్సీ ని పూర్తి పారదర్శకంగా నిర్వహించాశీ ఎంపీ చిన్ని



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-విజయవాడలోని ఎంపీ కార్యాలయశీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ లోని తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారుఈ సమావేశంలో సాక్షి పత్రికలో ప్రచురిస్తున్న వార్తల్లో వాస్తవాలు లేవని, డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వారు కూడా నియామకాలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.స్పోర్ట్స్ కోటా నిబంధనలపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలకు అధికారులు ఇప్పటికే స్పష్టమైన వివరణ ఇచ్చారని ఎంపీ తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారం నేరుగా కేటాయింపులు జరుగుతాయని, అభ్యర్థుల ఎంపికలో మెరిట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలు ఉంటాయని చెప్పారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వారు ఆధారాలు చూపాలని సవాల్ చేశారు.డీఎస్సీని పూర్తి పారదర్శకంగా నిర్వహించి సుమారు 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించామని, వారు ఇప్పటికే విధుల్లో ఉన్నారని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. తొమ్మిది నెలల తర్వాత ఇప్పుడు డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న రాద్ధాంతం వారి రాజకీయ ఉద్దేశాలను స్పష్టం చేస్తోందన్నారు. రామకృష్ణ విషయంలో వైసీపీ అనుకూల మీడియాలో తప్పుడు కథనాలు ప్రచురించారని, ఆయన ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న విషయం ఇందుకు సజీవ సాక్ష్యమని ఎంపీ తెలిపారు. వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు.ఏపీపీఎస్సీలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై విచారణ కొనసాగుతోందని, గ్రూప్-1 అంశంపై కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని ఎంపీ చిన్ని తెలిపారు. త్వరలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే వైసీపీ నేతలు డీఎస్సీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బహిరంగ చర్చకు సిద్ధమని ఇప్పటికే సవాల్ చేశారని, దమ్ముంటే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ సవాల్‌ను స్వీకరించి అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఎంపీ చిన్ని అన్నారు.ప్రజలకు ఉద్యోగాలు, కుటుంబాల్లో ఆనందం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మబోరని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఎంపీ చిన్ని పేర్కొన్నారు.అనంతరం వేముల రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల రాధిక అనే మహిళ తన పేరును ప్రస్తావిస్తూ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని వేముల రామకృష్ణ స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్వహించిన పరీక్షలో తనకు 104 మార్కులు మాత్రమే వచ్చాయని, తనకు ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాలేదని తెలిపారు.తాను రూ.15 లక్షలు చెల్లించి డీఎస్సీ ఉద్యోగం కొనుగోలు చేశానంటూ తనపై ఆరోపణలు చేయడం తీవ్రంగా బాధించిందని అన్నారు. నిజంగా తనకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చి ఉంటే, తాను ప్రస్తుతం ఏ స్థానంలో ఉన్నానో ఆధారాలతో చూపించాలని సవాల్ చేశారు.రాజకీయ ప్రయోజనాల కోసం తనను దోషిగా చూపించే ప్రయత్నం జరుగుతోందని, తన గురించి ఎవరైనా పూర్తిస్థాయిలో విచారణ చేసుకోవచ్చని వేముల రామకృష్ణ స్పష్టం చేశారు. ప్రస్తుతం కూడా తాను ఉదయం నుంచి రాత్రి వరకు ప్రైవేటు విద్యాసంస్థలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం --ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్ నగర్ లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయం లో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే చీణూ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు.61వ. డివిజన్ దేవినేని గాంధీపురం ప్రాంతంలో అర్హులైన పేద కుటుంబాలకు 306 జీవో ప్రకారం ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను బొండా ఉమా చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రం అందడం కేవలం ఒక కాగితం కాదని, అది వారి సొంతింటి కలకు తొలి అడుగు, భవిష్యత్తుకు భరోసా, కుటుంబానికి ఆత్మవిశ్వాసం అని పేర్కొన్నారు.గతంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు అందించే ప్రక్రియను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. పేదల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే ప్రజాసేవకు అసలైన అర్థమని ఉమా అన్నారు. సంక్షేమం--అభివృద్ధిని సమన్వయం చేస్తూ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆకుల సూర్య ప్రకాష్, ఇంచార్జ్ దాసరి దుర్గారావు, క్లస్టర్ ఇంచార్జ్ దాసరి కనకారావు, బూత్ కన్వీనర్ పోతర్లంక దుర్గాప్రసాద్, చింతల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్లి అభివృద్ధికి

# రూ.96 కోట్లు -మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-ప్రజాహితమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.కొండపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను క్షుణ్ణంగా విన్నారు.హౌసింగ్, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గానికి రూ.1 కోటి నిధులను కేటాయించారని, ఈ నిధులతో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే కొండపల్లి అభివృద్ధికి రూ.96 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు రాగానే టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, అన్ని ఒక పక్కా ప్రణాళికతో కొండపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు."ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రధాన లక్ష్యం. జనహితమే మనహితం అన్న నినాదంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరిస్తాం. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేస్తాం" అని ఎమ్మెల్యే అన్నారు. ఇళ్ళస్థలాలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు రాగానే తగు చర్యలు తీసుకుంటామన్నారు.అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పింఛన్ దారుల సాంకేతిక లోపాలను అప్పటికప్పుడు సరి చేశారు.ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గుంటుపల్లిలో రూ.45 లక్షలతో

# డ్రైయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

చేసిన మైలవరం ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో మొత్తం రూ.45 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు.గుంటుపల్లి గ్రామంలోని రామకృష్ణానగర్‌లో వివిధ ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.25 లక్షలు జెడ్పీ 23% జీఎల్ నిధుల ద్వారా, అలాగే అంబేద్కర్‌నగర్‌లో వివిధ ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.20 లక్షలు జెడ్పీ 15% ఎస్సీ నిధుల ద్వారా కేటాయించినట్లు తెలిపారు. ఈ రెండు పనులకు కలిపి మొత్తం అంచనా విలువ రూ.45 లక్షలు అని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తోందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో డ్రెయిన్లు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ నిధులు మంజూరు చేయించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.గుంటుపల్లి గ్రామంలో డ్రెయిన్ల నిర్మాణంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను సూచించారు.ప్రజల సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ల ప్రక్రియను వేగవంతం చేశాం

పెన్షన్ల కోసం దరఖాస్తు

చేసుకున్న వారు సచివాలయాలలో

జు- ఖీజ అప్‌డేట్ చేసుకోవాలి. సెంట్రల్లో 25 వేల పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా అందజేస్తాం - ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):- అజిత్ సింగ్ నగర్ లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించు ప్రజా దర్బార్ లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నేరుగా ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదు, ప్రతి అర్జీపై జవాబుదారీతనంతో స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నామని, పరిష్కరించగలిగిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, ఏదైనా కారణంతో ఆలస్యం అయితే అందుకు గల కారణాలను కూడా ప్రజలకు వివరిస్తున్నామని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ లక్ష్యమని.ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామని . పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు, మంచానికే పరిమితమైన వారికి రూ.10 వేలు, తలసేమియా బాధితులకు నెలకు రూ.15 వేలు అందిస్తున్నామని చెప్పారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామని.సంక్షేమంతో పాటు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు సుమారు రూ.650 కోట్ల మేర నిధులు ఖర్చు చేశామని బొండా ఉమా తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల ఇటీవల నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచిందని, ఈ గుర్తింపు తనకు మాత్రమే కాకుండా నియోజకవర్గ ప్రజలందరికీ దక్కిన గౌరవమన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి పెన్షన్ల సమస్యలను తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీలో కూడా ప్రస్తావించడంతో కొత్త పెన్షన్ల ప్రక్రియ వేగవంతమైందని ఉమా తెలిపారు. వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు సచివాలయానికి వెళ్లి ఖీజ, వేలిముద్ర వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కొత్త పెన్షన్ అర్హుల జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకోవాలనుకునే వారు ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించవచ్చుని, కార్యాలయంలోని సిబ్బంది వారికి పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి విచ్చేసి మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారని . నియోజకవర్గంలోని అరుణోదయ నగర్, సుబ్బరాజు నగర్, దేవినేని గాంధీనగర్, ఇందిరా కాలనీ, నర్సరాజు రోడ్, తుంగం రాములు , వీధి, గిరిపురం, కస్తూరిబా పేట, సుందరయ్య నగర్ తదితర ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరిస్తున్నామని చెప్పారు.సుమారు 25 వేల మంది పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించే ప్రక్రియను పూర్తి చేస్తున్నామని, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేదలకు వారి స్థలాలపై శాశ్వత హక్కు కల్పించనున్నామని, ఇకపై పట్టాల కోసం వీ=ూ కార్యాలయం చుట్టూ, ఎమ్మెల్యే కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా శాశ్వత పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని బొండా ఉమా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం చీణూ కూటమి శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

# నూతన పెన్షన్ల దరఖాస్తుల సమయంలో వస్తున్న ఇబ్బందులపై చర్చ

సమావేశంలో వచ్చిన ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ

-ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది: ఎమ్మెల్యే రాము

-కూటమి ప్రభుత్వంపై....ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలి: ఎమ్మెల్యే రాము

-ప్రజలను వర్గాలుగా విభజించి రాజకీయ లబ్ధి పొందాలని చూశారు:రావి

-గుడివాడ అభివృద్ధికి ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో సమష్టి కృషి:రావి





గుడివాడ, సెప్టెంబర్ 11నేటి శుభోదయ : ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఆయన అధ్యక్షతన గుడివాడ నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన పెన్షన్ల దరఖాస్తుల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, సచివాలయాల పరిధిలో ప్రజలకు తలెత్తుతున్న సమస్యలను మండలాల వారీగా నాయకులు ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో నమోదు చేసిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

## అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ

ప్రజా ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. సీఎం చంద్రబాబు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా ప్రభుత్వానికి అనుసంధానంగా క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. నేడు సమావేశంలో తీసుకొచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.నాయకులు సచివాలయాల పరిధిలో పర్యటిస్తూ నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని రాము కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం కూడా పార్టీ శ్రేణుల బాధ్యతేనన్నారు. మనం 90% ప్రజల సమస్యలను పరిష్కరించగలుగుతున్నామని, కానీ మిగిలిన 10% సమస్యల పరిష్కారం కోసం మనం చేసిన కృషిని వారికి వివరించాలని తెలిపారు.

## ప్రజలకు చేసిన మంచిని తెలియజేయాలి

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని రాము పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామ గ్రామాన, వార్డు వార్డున ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతుతో కూటమి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. గుడివాడ పట్టణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక మార్పులు తీసుకొచ్చామని, గతంలో ట్యాంకర్లపై ఆధారపడిన పరిస్థితిని అధిగమించి ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టామని రావి తెలిపారు. గుడివాడ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.గత పాలనలో అభివృద్ధి కంటే రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చారని, ప్రజలను వర్గాలుగా విభజిస్తూ రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రయత్నాలు జరిగాయని రావి విమర్శించారు. ప్రస్తుతం గుడివాడను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో కూటమి నాయకులు సమష్టిగా పనిచేస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని రావి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.సమావేశంలో గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,గుడివాడ, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, వాసే మురళి,దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకట్రావు, కార్పొరేషన్ డైరెక్టర్లు దింట్యాల రాంబాబు,మజ్జాడ నాగరాజు,టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, లింగం ప్రసాద్, క్లస్టర్ ఇన్చార్జులు తాతినేని మురళి, ఉప్పల వెంకటేశ్వరరావు,మాదాల సురేష్, పంచమర్తి శ్రీనివాసరావు, నేరుసు కాశి, సయ్యద్ జబిన్, తోకల క్రాంతి, వీరవరపు వంశీ, కొడాలి రామరాజు, వల్లభనేని సుబ్బారావు,యూనిట్, బూత్, ఇన్చార్జులు, వార్డు, గ్రామ పార్టీల అధ్యక్ష కార్యదర్శులు, గుడివాడ నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# వార్డుల పెంపుపై 14 అభ్యంతరాలు స్వీకరణ



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల సంఖ్యను 64 నుంచి 86కు పెంచే ప్రతిపాదనపై ప్రజల నుంచి మొత్తం 14 అభ్యంతరాలు అందినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల పునర్విభజనకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి, ఈ ప్రాథమిక నోటిఫికేషన్‌పై ప్రజలు తమ అభ్యంతరాలు, సూచనలు తెలియజేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని . ఈ నేపథ్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంబంధిత వర్గాల నుంచి మొత్తం 14 అభ్యంతరాలు నగరపాలక సంస్థకు అందాయని అన్నారు.

# వినాయక చవితి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

-మునిసిపల్ కమీషనర్ మనోహర్



గుడివాడ, సెప్టెంబర్ 11 నేటి శుభోదయ: వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఎంపిక చేసిన ప్రదేశాల్లో చేపట్టిన ఏర్పాట్లను గుడివాడ పురపాలక సంఘం కమీషనర్ ఎస్. మనోహర్ పరిశీలించారు.ఈ సందర్భంగా దొండపాడు కాలువ సెంటర్, పెద్దకాలువ సెంటర్ వద్ద నిమజ్జనానికి సంబంధించి పారిశుద్ధ్యం, భద్రత, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు తదితర ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.నిమజ్జన కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు షిఫ్ట్‌ల వారీగా సిబ్బందికి విధులు కేటాయించడం జరిగింది. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని కమీషనర్ సూచించారు.అలాగే ప్రజలందరూ పర్యావరణహిత విధానంలో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమీషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సతీష్ చంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివాజీ, అసిస్టెంట్ ఇంజనీర్లు రాజేష్, శివాజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మనం తెలుగుదేశం కార్యకర్తలమని గర్వపడాలి

-పోరాట స్ఫూర్తిని ఎన్టీఆర్ వారసత్వంగా ఇచ్చారు

-స్థానిక సంస్థల ఎన్నికల్లో 100% విజయమే లక్ష్యం... ఒక్క శాతం కూడా తగ్గకూడదు

-ఏకాభిప్రాయంతో స్థానిక అభ్యర్థుల ఎంపిక. ఏకగ్రీవాలపై ఆసక్తి లేదు....ప్రజల మద్దతుతో ఎన్నికల్లో గెలుపుకు ప్రాధాన్యత

కోర్టులు ఛీ కొట్టినా వైసీపీకి సిగ్గు రావడం లేదు

-టీడీపీ ని కూడా అరాచక...వైసీపీతో సమానం చేయాలని చూస్తున్నారు

-ఎ. పి. పి. ఎస్. సి పరీక్షల్లో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు వాటిని తప్పిపుచ్చడానికి మెగా డి. ఎస్. సి పై బురద చదువుతున్నారు



గుడివాడ, సెప్టెంబర్ 11 నేటి శుభోదయ: గుడివాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయం (ప్రజావేదిక)లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధ్యక్షతన టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్యే రాము ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ“మనం తెలుగుదేశం కార్యకర్తలం.. అందుకు మనమంతా గర్వపడాలి. అధికారంలో ఉన్నా.. లేకపోయినా ప్రజల తరఫున పోరాడటమే మన నైజం” అన్నారు. పోరాటం అనేది టీడీపీ కార్యకర్తల రక్తంలోనే ఉందని, ఆ పోరాట స్ఫూర్తిని ఎన్టీఆర్ తమకు వారసత్వంగా అందించారని పేర్కొన్నారు. మన ఆత్మగౌరవం కోసం, కష్టాల్లో ఉన్న ప్రజల కోసం టీడీపీ కార్యకర్తలు ఎప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## వైసీపీపై ఎమ్మెల్యే రాము ఫైర్

ప్రతిపక్ష వైసీపీకి బురద చల్లడమే లక్ష్యంగా మారిందని ఎమ్మెల్యే రాము తీవ్రస్థాయిలో విమర్శించారు. “కోర్టులు ఛీ కొట్టినా వారికి సిగ్గు రావడం లేదు” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో జరిగిన అరాచకాల గురించి ప్రస్తావించిన రాము.. మంచి చేయడం వైసీపీకి అవసరం లేదని విమర్శించారు. టీడీపీని కూడా వైసీపీతో సమానం చేయడానికే ఆ పార్టీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో జరిగిన ఎ. పి. పి. ఎస్. పరీక్షల్లో అక్రమాలు అన్ని ఇన్ని కావని రాము ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, మెగా డీఎస్సీపై బురద చల్లడం ద్వారా గతంలో జరిగిన విషయాలను కప్పిపుచ్చలేరని అన్నారు.

## గుడివాడ టీడీపీ ఐక్యతకు సీఎం చంద్రబాబు ప్రశంసలు

గుడివాడలో టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న ఐక్యతను పార్టీ వేదికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం కొనియాడుతున్నారని ఎమ్మెల్యే రాము తెలిపారు.“నాకు రాజకీయాలు తెలియదు.. జీరో నాలెడ్జ్‌తో గుడివాడ వచ్చాను. అందర్నీ కలుపుకొని పోవడానికి ప్రాధాన్యత ఇచ్చాను” అని రాము అన్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రజల కోసం పనిచేస్తుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీ శ్రేణుల సహకారంతో గుడివాడలో ప్రజలకు సేవ చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.దశాబ్దాల పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గౌరవించుకోవాలని ఎమ్మెల్యే రాము అన్నారు. “పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ఏ ఒక్కరినీ నేను వదులుకోను” అని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఐక్యతను కొనసాగిస్తూ అఖండ విజయం సాధించాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు కలిసి కూర్చొని చర్చించుకోవాలని, ఏ ఊరికి ఆ ఊరు అభ్యర్థిని ఏకాభిప్రాయంతో ఎంపిక చేసుకోవాలని సూచించారు.అయితే ఎన్నికల్లో ఏకగ్రీవాలపై తనకు ప్రత్యేక ఆసక్తి లేదని రాము స్పష్టం చేశారు. ప్రజల మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధించడానికే తాను ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని పొందుతూ ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.సొంత తల్లిని, చెల్లిని సరిగ్గా చూసుకొని వాడు మనల్ని ఏం చూసుకుంటాడని ప్రజలకు కూడా నమ్మకం లేదు” అని వ్యాఖ్యానించారు.పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపుతూ ఎమ్మెల్యే రాము కీలక వ్యాఖ్యలు చేశారు. “మనల్ని మించిన పార్టీ లేదని,కూటమిని మించిన ప్రభుత్వం లేదని, టీడీపీ కార్యకర్తను మించిన కార్యకర్త లేదు” అని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయం సాధించాలని.. ఒక్క శాతం తగ్గినా మన కూటమి ఒప్పుకోవద్దని పార్టీ శ్రేణులకు స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి టీడీపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ కార్యకర్తల ఐక్యత, పోరాట స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో అఖండ విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే రాము పిలుపునివ్వడంతో.. పార్టీ నాయకులు, కార్యకర్తలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. రాము ప్రసంగం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగడంతో ప్రజావేదిక కార్యాలయం చప్పట్లతో మారుమోగింది.సమావేశంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు,గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,గుడివాడ, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, వాసే మురళి,దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకట్రావు, కార్పొరేషన్ డైరెక్టర్లు దింట్యాల రాంబాబు,మజ్జాడ నాగరాజు,టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, బొంబాయి శ్రీను , లింగం ప్రసాద్, క్లస్టర్ ఇన్చార్జులు తాతినేని మురళి, ఉప్పల వెంకటేశ్వరరావు,మాదాల సురేష్, పంచమర్తి శ్రీనివాసరావు, నేరుసు కాశి, సయ్యద్ జబిన్, తోకల క్రాంతి, వీరవరపు వంశీ, కొడాలి రామరాజు, వల్లభనేని సుబ్బారావు,యూనిట్, బూత్, ఇన్చార్జులు, వార్డు, గ్రామ పార్టీల అధ్యక్ష కార్యదర్శులు, గుడివాడ నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# “ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రోగ్రామర్స్ డే వేడుకలు”




తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 11 (నేటి- శుభోదయ) : ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రోగ్రామర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పి.ఎన్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ కె. కృష్ణ పాల్గొని విద్యార్థులను అభినందించారు.ప్రోగ్రామర్స్ డే సందర్భంగా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనలు మరియు పోటీ స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో కోడింగ్, డీబగ్గింగ్, క్విజ్ మరియు ప్రెజెంటేషన్ వంటి వివిధ పోటీలను నిర్వహించారు. కళాశాలలోని మొదటి మరియు రెండవ సంవత్సరం విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.ప్రోగ్రామర్స్ డే వేడుకలు ముగిసిన అనంతరం, కళాశాల పరిసరాల్లో షూటింగ్ నిర్వహిస్తున్న ‘వేట’ సినిమా చిత్రబృందం షూటింగ్ పూర్తి చేసుకుని కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా చిత్రబృందం విద్యార్థులను కలుసుకుని వారితో ముచ్చటించి, వారిలో ఉత్సాహాన్ని నింపింది. విద్యార్థులతో కొంత సమయం గడిపిన సినిమా బృందం, వారి విద్యా మరియు సృజనాత్మక కార్యక్రమాలను అభినందిస్తూ మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని ప్రోత్సహించింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.ఎన్. శ్రీనివాసరావు, విజేతలను అభినందిస్తూ, విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ప్రోగ్రామర్స్ డే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన కార్యక్రమ సమన్వయకర్తలు మరియు అధ్యాపకులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

# సమస్యలు తెలుసుకుంటాం.... సంక్షేమాన్ని అందిస్తాం. ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడమే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే కాకుండా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తున్నామని అన్నారు. పటమట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించి వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలు చెబుదామంటే వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రజలకు కనిపించే వారు కాదని అన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూన్నామని, అంతేకాకుండా ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ పేరుతో అధికారులను సైతం తీసుకువచ్చి ప్రజలకు చేరువ చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, మైలమూరి పీరుబాబు, పటాన్ హయత్‌ఖాన్, సింగంశెట్టి రమేష్, మేదరమెట్ల నారాయణ, గోగుల ఏసుబాబు, గళ్ళా రవి, పామర్తి కిషోర్, పత్తి రామారావు, పఠాన్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు తెలుసుకుంటాం.. సంక్షేమాన్ని అందిస్తాం. ఎమ్మెల్యే గద్దె




విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడమే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే కాకుండా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తున్నామని అన్నారు. పటమట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించి వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలు చెబుదామంటే వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రజలకు కనిపించే వారు కాదని అన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూన్నామని, అంతేకాకుండా ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ పేరుతో అధికారులను సైతం తీసుకువచ్చి ప్రజలకు చేరువ చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, మైలమూరి పీరుబాబు, పటాన్ హయత్‌ఖాన్, సింగంశెట్టి రమేష్, మేదరమెట్ల నారాయణ, గోగుల ఏసుబాబు, గళ్ళా రవి, పామర్తి కిషోర్, పత్తి రామారావు, పఠాన్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

# మితిమీరుతున్న హిజ్రాల ఆగడాలు



ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ ::: కొందరికి హిజ్రాల ప్రవర్తన వల్ల మొత్తం వారి సమాజం పైనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. శుభకార్యాలలో వేడుకలలో ఇష్టానుసారంగా డబ్బులు డిమాండ్ చేయటం కార్యక్రమాలు సజావుగా కాకుండా అల్లర్లు చేయటం కొందరు హిజ్రాల తీరు ఇదే. దీని మూలంగా సజావుగా మంచిగా వసూలు చేసే హిజ్రాలు డిమాండ్ చేయకుండా ఇచ్చినవి తీసుకుని మంచి మనసున్న హిజ్రాలకు అవమానాలు ఎదురవుతున్నాయి . హైదరాబాద్ సి. పి. సివి ఆనంద్ హిజ్రాలపై హెచ్చరికలు జారీ చేయడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నాయి. సజావుగా వసూలు చేసే వారికి ఎటువంటి ఆటంకం ఉండదు. కానీ డిమాండ్ చేసి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ పాఠం కలిగిస్తున్న వారిపైనే ఎటువంటి ప్రభావం చూపుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఇటువంటి సంస్కృతి ఎక్కువగా ఉంది కొన్ని చోట్ల ఇంటి యజమానులపై డబ్బులు ఇవ్వలేదని దాడి చేయడం రక్తం వచ్చే విధంగా దాడి చేసిన సంఘటన గతంలో వెలుగు చూసింది. హిజ్రాల పట్ల సిపి ఆనం చేసిన ప్రకటన వల్ల ప్రతి జిల్లాలో హిజ్రాల ఆగడాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని జిల్లాలలోని పోలీసు అధికారులు ఆయా ప్రదేశాలలోని హిజ్రాల నాయకులను పిలిచి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు అరెస్టులు తప్పవని చెప్పారు. చదువుకున్న హిజ్రాలకు ఉద్యోగాలలో అవకాశాలు వస్తున్నాయని కొందరు పోలీస్ కానిస్టేబుళ్లు కొందరు డాక్టర్లు ఉంటూ సమాజానికి సేవ చేస్తున్నారని ఆ బాటలోనే మీరు నడవాలని. మితిమీరిన వసూలు చేయకూడదని సక్రమ పద్ధతిలో వసూలు చేసుకుంటే మంచిదని సూచించడం జరిగింది. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే మన దగ్గరే ఎటువంటి ఆగడాలు నడుస్తున్నాయి తెలుస్తుంది. హిజ్రాల నాయకులు అసంఘికంగా పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజల నుండి విజ్ఞాపనలు వస్తున్నాయి. రైళ్లలో సైతం హిజ్రాల హింస ప్రయాణికులు తప్పట్లేదు. ఇది నిజాయితీ హిజ్రాల కు ఇబ్బంది ఏర్పడుతుంది. నాయకులు పోనుకొని అటువంటి చర్యలు తీసుకోవాలి. కొందరు ఇచ్చిన దాంతో వారి దీవెన లు అందుకుంటున్నారు. కొందరు శుభకార్యాలకు హిజ్రాలను ప్రత్యేకంగా పిలిచి వారి దీవెనలు తీసుకొని తగు రీతిలో వారికి కానుకలు ఇస్తున్నారు. హిజ్రాల శాపనార్థాలు మంచివి కావని వారితో ఘర్షణలు ఎందుకని అడిగిన తడవుగాని కొందరు డబ్బులిస్తున్నారు. ఇది సాకుగా తీసుకొని కొందరు డబ్బులు దండుకుని ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల నుండి ప్రజల నుండి విజ్ఞప్తులు అధికంగా రావటంతో పోలీస్ శాఖ వారు కఠిన చర్యలకు ఉపాక్రమించారు. కొన్ని ఇతర రాష్ట్రాలలో ఇటువంటి పరిస్థితి లేదు. ఏది ఏమైనా పోలీస్ చర్యలకు పబ్లిక్ న్నంచి ప్రశంసలు వెళువేతుతున్నాయి.

## విజన్ హై స్కూల్‌లో ఘనంగా మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు



యాడికి సెప్టెంబరు 11 అనంతపురం జిల్లా రిపోర్టర్ బందారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలంలోని గుత్తి రోడ్డులో గల విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలను అత్యంత కోలాహలంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)లతో చేసే విగ్రహాల వాడకాన్ని సంపూర్ణంగా అరికట్టి, ప్రకృతిసిద్ధమైన మట్టి గణపతుల ప్రాధాన్యతను సమాజానికి చాటిచెప్పేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా పాల్గొన్నారు. తమ చేతివ్రేళ్ల నైపుణ్యంతో విభిన్న రూపాల్లో ఆకర్షణీయమైన, పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమలను తీర్చిదిద్ది తమలో దాగి ఉన్న అద్భుతమైన సృజనాత్మకతను, కళాత్మక ప్రతిభను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన ముగింపు సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆకట్టుకునే విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్ బహుమతులు పంపిణీ చేసి, వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రాథమిక నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు, బాల్యం నుంచే ప్రకృతి సంరక్షణపై పూర్తి స్థాయి అవగాహన, బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. పండగల వేళ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీరు, వాతావరణం కలుషితమవుతున్నాయని, ప్రతి ఒక్కరూ విధిగా మట్టి గణపతులనే పూజించి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అనంతపురం స్పోర్ట్స్ మోడల్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలు

**స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ మోడల్ - భవిష్యత్ క్రీడాకారులను తయారు చేసేలా కార్యక్రమం రూపొందించిన అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.. 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ మోడల్ ను వివరించిన అనంతపురం జిల్లా కలెక్టర్.. జిల్లా కలెక్టర్ ని అభినందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు**



అనంతపురం, బ్యూరో సెప్టెంబర్ 11 నేటి శుభోదయ : అనంతపురం స్పోర్ట్స్ మోడల్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలు కురిపించారు. రాష్ట్రవ్యాప్తంగా అమలుకు సీఎం ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో రెండవ రోజు అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు అనంతపురం జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక క్రీడా విధానం (డిస్ట్రిక్ట్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ మోడల్) అద్భుతమైన ఫలితాలనిస్తోందని, అనంతపురం జిల్లా కలెక్టర్ డా.ఓ.ఆనంద్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి వివరించారు. ఈ విధానంపై ముఖ్యమంత్రి ప్రత్యేక హర్షం వ్యక్తం చేస్తూ, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రజెంటేషన్ ఇస్తూ.. స్కూల్స్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పేరిట కార్యక్రమం నిర్వహించామని వివరించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి, అక్కడి నుంచి జాతీయ స్థాయికి కూడా క్రీడాకారుల్ని ప్రోత్సహించేలా విధానం రూపొందించామన్నారు. అనంతపురంలో విద్యార్థుల విస్తృత భాగస్వామ్యమే లక్ష్యంగా పాఠశాల, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో క్రీడల ఛాంపియన్ షిప్ నిర్వహించేలా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పీ4 విధానంలో క్రీడా ఉపకరణాలు, మెడల్స్ అందించే విధానం రూపకల్పన చేశామని, వివిధ క్రీడల్లో టాలెంట్ ను గుర్తించేలా... గ్రామీణ క్రీడాకారులకు ఉపకరించేలా ఈ స్కూల్ ఛాంపియన్ షిప్ కార్యక్రమం నిర్వహించామన్నారు. జిల్లాకు రూ.20 లక్షల వ్యయంతో క్రీడా పోటీలు ఏర్పాటు చేశామని వివరించారు. పాత పద్ధతి అయిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లాగా కేవలం ఎంపిక ట్రయల్స్‌పై కాకుండా, అందరి భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇస్తూ క్రీడలను నిర్వహించామన్నారు. పోటీలను ముందుగా పాఠశాల స్థాయిలో నిర్వహించి, విజేతలను మండల స్థాయి, నియోజకవర్గం, జిల్లా స్థాయిలకు పంపించామన్నారు. గతంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా సుమారు 1,600 మంది మాత్రమే పాల్గొనగా, ఈ కొత్త విధానంలో జిల్లాలో 544 పాఠశాలల నుండి 25,048 మంది విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో (సుమారు 16 రెట్లు పెరుగుదల) పాల్గొన్నారన్నారు. అందులో 45 శాతం మంది బాలికలు ఉన్నారన్నారు. 8 క్రీడా రంగాల్లో ఈ పోటీలను నిర్వహించామని, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ మరియు జూడోలలో ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు. అదనపు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వ శాఖల సమన్వయంతో పోటీలను నిర్వహించామని, విద్యార్థుల రవాణాకు సంబంధించి బాలికల కోసం 'స్త్రీశక్తి' ఉచిత బస్సు ప్రయాణాన్ని మరియు బాలుర కోసం ప్లాన్ చేసిన పాస్‌లను, జీరామ్‌జీ సహకారంతో క్రీడా మైదానాల అభివృద్ధిని ఉపయోగించామని తెలిపారు. పాఠశాల విద్యా శాఖ నుంచి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశామని, పిఈటిలను మరియు క్రీడల శాఖ కోచ్‌లను ఇందులో భాగస్వామ్యం చేశామన్నారు. అనంతపురం ఆర్డిటి క్రీడా ప్రాంగణాలను, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్ల నుంచి చిన్న ఖర్చుల మద్దతును మరియు సిఎస్ఆర్ నిధుల ద్వారా పతకాలు, షీల్డ్‌లను అందించామని తెలిపారు. స్కూల్స్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ కోసం 20 లక్షల రూపాయల నిధులతో ఈ పోటీలను నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేలా అనంతపురం జిల్లా కలెక్టర్ వినూత్నంగా కొత్త కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. విద్యార్థులను అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక విధానాన్ని రూపొందించారన్నారు. జిల్లా స్థాయిలో క్రీడా పాఠశాలల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకొని రాబోయే 10 ఏళ్లలో రాష్ట్రంలో బలమైన క్రీడా వ్యవస్థను తీర్చిదిద్దాలని విద్యా శాఖ మంత్రి, శాప్ డైరెక్టర్ లకి సూచించారు. నర్సరీ కాన్సెప్ట్, ప్రతిభ గుర్తింపు, ఈవెంట్ల నిర్వహణ, క్రీడాకారుల నైపుణ్యాల బెంచ్‌మార్కింగ్, నిరంతర శిక్షణలతో కూడిన సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా స్కూల్ ఎడ్యుకేషన్, శాప్ నిధులతో పాటు పీపీపీ/సీఎస్ఆర్ నిధులను, కేంద్ర ప్రభుత్వ నిధుల అనుసంధానం జోడించి దీనిని శాశ్వత ప్రాతిపదికన నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో బాలురు, బాలికలకు ప్రత్యేక రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు, అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలను ప్రధాన స్పోక్ హబ్‌లుగా మలచి, అన్ని జిల్లాలను అనుసంధానించేలా 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ను అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

## రోడ్లపై వాహనాలు నిలిపి డ్రైనేజీలను అడ్డుకోవద్దు

విజయవాడ, సెప్టెంబర్ 11 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం అరండల్‌పేట ప్రాంతంలో రోడ్లపై వాహనాలను నిలిపి డ్రైనేజీ మార్గాలను, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా ఆక్రమణలకు పాల్పడుతున్న ఆటో కన్సల్టెంట్లపై చర్యలు చేపట్టారు. 25వ డివిజన్ అరండల్‌పేటలోని పలు ఆటో కన్సల్టెన్సీల వద్ద రోడ్లపై వాహనాలను పెద్ద సంఖ్యలో నిలిపి ఉంచడం వల్ల మురుగునీటి కాలువలను శుభ్రపరిచే పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వాహనాల కారణంగా కాలువలపైకి సిబ్బంది, యంత్రాలు చేరుకోలేకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, వర్షాల సమయంలో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయే పరిస్థితులు తలెత్తుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా రోడ్లను ఆక్రమించి వాహనాలను నిలిపి ఉంచడం, డ్రైనేజీ మార్గాలకు ఆటంకం కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్, పోలీస్ మరియు ప్రజారోగ్య విభాగాల సమన్వయంతో ఇటువంటి సమస్యలపై నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా అరండల్‌పేటలోని సంబంధిత ఆటో కన్సల్టెన్సీలకు నోటీసులు జారీ చేసి, రోడ్లపై నిలిపి ఉంచిన వాహనాలను మూడు రోజుల్లోగా తొలగించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా వాహనాలను తొలగించకపోతే సంబంధిత నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నగరంలోని వ్యాపార సంస్థలు, ఆటో కన్సల్టెంట్లు తమ కార్యకలాపాల కోసం రోడ్లను ఆక్రమించకుండా, ప్రజల రాకపోకలకు, పారిశుధ్య నిర్వహణకు మరియు డ్రైనేజీ వ్యవస్థకు ఎలాంటి ఆటంకం కలగకుండా సహకరించాలని నగరపాలక సంస్థ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొని సంబంధిత సంస్థలకు నోటీసులు జారీ చేశారు.

## నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి రెండవ గొప్ప ధార్మిక బహిరంగ సభను జయప్రదం చేయండి

**- ముఖ్య అతిథులుగా హాజరు కానున్న మౌలానా ముఫ్తీ సల్మాన్ సాహెబ్ బిజునూరి, (ప్రొఫెసర్ హదీస్ దారుల్ ఉలూమ్ దేవబన్ ఉత్తరప్రదేశ్ ), డాక్టర్ హాఫీజుర్ రహమాన్ సాహెబ్,( కన్వీనర్ ఖుసురో ఫౌండేషన్ ఢిల్లీ) స్వామి లక్ష్మిశంకరాచార్య (ఫౌండర్ హిందూ ముస్లిం జన్ ఏక్తా మన్చ్ కాన్పూర్ ఉత్తరప్రదేశ్ )**

**- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ప్రెసిడెంట్ మౌలానా షేక్.ముజాహిద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్**



ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ ::: ఈనెల 12వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోనీ శనివారం, మగ్రిబ్ నమాజ్ అనంతరం కొత్తగూడెం క్లబ్, కొత్తగూడెంలో సమస్త మానవాళికి ప్రవక్త ముహమ్మద్ (స.అ.స) సందేశంజిల్లా స్థాయి రెండవ గొప్ప ధార్మిక బహిరంగ సభను జయప్రదం చేయాలని ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ప్రెసిడెంట్ మౌలానా షేక్ ముజాహిద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ ధార్మిక సభకు ముఖ్య అతిథులుగా మౌలానా ముఫ్తీ సల్మాన్ సాహెబ్ బిజునూరి, (ప్రొఫెసర్ హదీస్ దారుల్ ఉలూమ్ దేవబన్ ఉత్తరప్రదేశ్ ), డాక్టర్ హాఫీజుర్ రహమాన్ సాహెబ్,( కన్వీనర్ ఖుసురో ఫౌండేషన్ ఢిల్లీ) స్వామి లక్ష్మి శంకరాచార్య (ఫౌండర్ హిందూ ముస్లిం జన్ ఏక్తా మన్చ్ కాన్పూర్ ఉత్తరప్రదేశ్ ) హాజరు కానున్నారని వారు తెలిపారు. ఈ ధార్మిక సభకు మత పెద్దలు, ముస్లిం మైనారిటీలు, ప్రొఫెసర్లు భారీగా తరలివచ్చి ఆధ్యాత్మిక సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

## జగ్గంపేట భాష్యం పాఠశాలలో ఘనంగా హిందీ దివస్, వినాయక చవితి మరియు గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 11 నేటి శుభోదయ : జగ్గంపేట లోని గల భాష్యం పాఠశాలలో శుక్రవారం రోజున హిందీ దివస్, వినాయక చవితి మరియు గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను అత్యంత ఘనంగా మరియు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, దేశ ఐక్యతకు హిందీ భాష ఎంతగానో దోహదపడుతుందని, విద్యార్థులు అన్ని భాషలతో పాటు హిందీ ప్రాముఖ్యతను కూడా గుర్తించాలని తెలిపారు. 1949వ సంవత్సరం సెప్టెంబర్ 14వ తేదీన హిందీ భాషను అధికార భాషగా ప్రభుత్వం ప్రకటించడంతో అప్పటినుండి సెప్టెంబర్ 14వ తేదీన హిందీ దివాస్ గా జరుపుకుంటున్నామన్నారు. అలాగే వినాయక చవితి పండుగ విశిష్టతను, ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. భారతీయుల అతి ముఖ్య పండుగలలో వినాయక చవితి ఒకటి అన్నారు. కుటుంబంలో వృద్ధుల పాత్ర, అభినవ తరంపై వారి ప్రభావం ఎంతో వెలకట్టలేనిదని పేర్కొంటూ 'గ్రాండ్ పేరెంట్స్ డే' వేడుకల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ జోనల్ ఇన్చార్జ్ గోవిందరాజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, హిందీ ఉపాధ్యాయులు దుర్గం, ఉపాధ్యాయురాలు సుజాత, అనిత, కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.




## పెన్షన్ల నమోదులో లబ్ధిదారుల సమస్యలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పెషల్ ఫోకస్

**-హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో తలెత్తుతున్న లోపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే రాము**

**-సాంకేతిక, డేటా లోపాల కారణంగా అర్హులకు నష్టం జరగకూడదని అధికారులకు... స్పష్టమైన సూచనలు చేసిన ఎమ్మెల్యే**



గుడివాడ, సెప్టెంబర్ 11 నేటి శుభోదయ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ పెన్షన్ల నమోదు కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో శుక్రవారం టిడిపి నాయకత్వం నుండి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అంశాలపై సమీక్షించిన ఎమ్మెల్యే రాము సాయంత్రం ప్రజావేదిక కార్యాలయంలో మండల పరిషత్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెన్షన్ల నమోదు, దరఖాస్తుల పరిశీలన సమయంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే రాము అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమవుతున్న సమస్యలను ఒక్కొక్కటిగా అధికారులతో చర్చించి, సాధారణ సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలసీ పరమైన సమస్యలపై ఇప్పటికే ఉన్నతాధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే రాము.. ఆయా సమస్యలకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో తలెత్తుతున్న సమస్యలను ఎమ్మెల్యే రాము ప్రస్తావించారు. అలాగే రేషన్ కార్డుల్లో మరణించిన వారి పేర్లు ఇంకా తొలగించకపోవడం వల్ల పెన్షన్ దరఖాస్తుల సమయంలో ఇబ్బందులు వస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పెన్షన్ దరఖాస్తుదారుల నుంచి కుల, ఆదాయ ధ్రువపత్రాలు కోరుతున్న అంశాన్ని కూడా ఎమ్మెల్యే రాము ప్రస్తావించారు. సొంతంగా భూమి లేని వారి ఆధార్ నంబర్లకు ఇతరుల భూమి వివరాలు అనుసంధానం కావడం వల్ల అర్హులైన వారు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. ఇలాంటి సాంకేతిక, డేటా సంబంధిత సమస్యలను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు నష్టం జరగకుండా చూడాలని సూచించారు. వయోవృద్ధులు, ఒంటరి మహిళల సమస్యలపై కూడా ఎమ్మెల్యే రాము ప్రత్యేకంగా చర్చించారు. పిల్లలు ఉన్నప్పటికీ సుమారు 20 సంవత్సరాల క్రితమే భర్త వదిలివెళ్లిన మహిళలకు ప్రస్తుత నిబంధనల ప్రకారం విడాకుల పత్రాలు లేకపోవడంతో పెన్షన్ పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాంటి సందర్భాల్లో తహశీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించే పంచనామాను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదేవిధంగా ముస్లిం మహిళలకు సంబంధించిన సమస్యలను కూడా ఎమ్మెల్యే రాము ప్రస్తావించారు. విడాకులు జరిగినప్పటికీ అధికారిక పత్రాలు లేని సందర్భాల్లో మసీదు కమిటీ లేదా ఖాజీ ఇచ్చే ధ్రువపత్రాన్ని పరిగణనలోకి తీసుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. సదరన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినప్పుడు వాస్తవానికి భూమి లేకపోయినా లేదా తక్కువ భూమి ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో 'భూమి ఎక్కువగా ఉంది' అని చూపిస్తున్న సమస్యను కూడా ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి డేటా లోపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి పెన్షన్ అందేలా చూడాలని సూచించారు. ఉదయం ప్రజల నుంచి నేరుగా తెలుసుకున్న సమస్యలకు కొనసాగింపుగా సాయంత్రం అధికారులతో సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపించేందుకు ఎమ్మెల్యే రాము చర్యలు చేపట్టారు. అర్హత ఉన్న ఏ ఒక్క లబ్ధిదారుడూ కేవలం సాంకేతిక, ధ్రువపత్రాలు లేదా డేటా సంబంధిత సమస్యల కారణంగా ప్రభుత్వ పెన్షన్‌కు దూరం కాకుండా అధికారులు శ్రద్ధతో వ్యవహరించాలని ఎమ్మెల్యే రాము సూచించారు. సాధారణ సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించాలని, పాలసీ పరమైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ఎండివోలు శ్రీనివాస్ రావు, ఇమ్రాన్, మల్లేశ్వరి, ఫిషరీస్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ జుమాయిమ్మ,ఎ. డి ప్రసాద్, ఎమ్మార్వో లు ప్రసాద్, లోకరాజు, గురుమూర్తి రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రైమ్ 9 న్యూస్ 4 మిలియన్ల మైలురాయి

**జగ్గంపేటలో ఘనంగా వేడుకలు**

**హాజరైన జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్**



**కాకినాడ జిల్లా జగ్గంపేట సెప్టెంబర్ 11 నేటి శుభోదయ :ప్రముఖ న్యూస్ ఛానెల్ 'ప్రైమ్ 9 న్యూస్' యూట్యూబ్‌లో 4 మిలియన్ల (40 లక్షలు) సబ్‌స్క్రైబర్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా కాకినాడ జిల్లా జగ్గంపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గ ప్రైమ్ 9 న్యూస్ రిపోర్టర్ ఎల్. శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటులో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రైమ్ 9 న్యూస్ యాజమాన్యానికి, పాత్రికేయులకు, సిబ్బందికి మరియు వీక్షకులకు జ్యోతుల నవీన్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ గ్రౌండ్ లెవెల్ సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ప్రైమ్ 9 న్యూస్ ఎల్లప్పుడూ ముందుంటోందని కొనియాడారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రైమ్ 9 న్యూస్ త్వరలోనే కోటి (10 మిలియన్ల) సబ్‌స్క్రైబర్ల మైలురాయిని దాటాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ ప్రైమ్ 9 రిపోర్టర్ ఎల్. శ్రీను, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.**

## మాచర్లలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

**పార్టీ ఐడీ కార్డుల పంపిణీ.. భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు**



మాచర్ల, సెప్టెంబర్ 11: ఆర్ సి ఇన్చార్జి నేటి శుభోదయ: మాచర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజా సమస్యలపై ముందుకు సాగడంపై సమావేశంలో చర్చించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట పార్లమెంట్ పరిధి నాయకులు పూనూరి గౌతమ్‌రెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. శ్యామల, రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి, ఎస్ఈసీ సభ్యులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, నాగార్జున యాదవ్ హాజరయ్యారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు ఎనుముల మురళీధర్‌రెడ్డి, మాచర్ల నియోజకవర్గ పరిశీలకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులను అందజేశారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచుతూ క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నాయకులు సూచించారు.



## చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

**సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి: ఎంఈవో-2 శివ నాగేశ్వరరావు**



రెంటచింతల: ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబరు 11; నేటి శుభోదయ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో టాలెంట్ టెస్టులు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో-2 శివ నాగేశ్వరరావు అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంచుకుని, నూతన విషయాలను తెలుసుకునేలా కృషి చేయాలని ఆయన సూచించారు.రెంటచింతల మండల కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ నేతృత్వంలో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సామర్థ్య పరీక్షలను నిర్వహించారు. మండలంలోని 12 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 700 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ముఖ్యంగా పాలువాయి జడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీరామకృష్ణ గురుకులానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా కన్వీనర్ వీజే. రాజ్‌కుమార్, కత్తి రవి, అనిల్‌కుమార్, నరసింహారావు, సుబ్బారావు, రత్నకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## 400 మందికి పైగా గిరిజనులకు ఉచిత వైద్య సేవలు

**ఏఐ టెక్నాలజీతో దంత పరీక్షలు.. కంటి పరీక్షలు, ఉచిత కళ్లజోళ్లు**

**ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్స**




నేటి శుభోదయం న్యూస్: దేవీపట్నం, సెప్టెంబర్ 11. ముచ్చు చిన్ని: మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ రాజమండ్రి సెంటీనియల్ పవర్ ఆధ్వర్యంలో ఇందుకూరు వన్ ఆర్అండ్ఆర్ పునరావాస కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గిరిజనుల నుంచి విశేష స్పందన లభించింది. 400 మందికి పైగా గిరిజనులకు కంటి, దంత పరీక్షలు నిర్వహించి వైద్యులు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు.

### ఏఐ టెక్నాలజీతో దంత పరీక్షలు

డాక్టర్ అడబాల సత్యప్రసాద్ ఆధ్వర్యంలోని ఆపిల్ డెంటర్ కేర్, మోరంపూడి, రాజమహేంద్రవరం వైద్య బృందం ఆధునిక ఏఐ టెక్నాలజీ సహాయంతో దంత పరీక్షలు నిర్వహించింది. దంత సమస్యలను గుర్తించి బాధితులకు తగిన వైద్య సూచనలు అందించారు. మారుమూల ప్రాంతాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దంత పరీక్షలు నిర్వహించడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

### కంటి పరీక్షలు.. ఉచితంగా కళ్లజోళ్లు

జగ్గంపేటలోని శ్రీమతి సుబ్బలక్ష్మీ లయన్స్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించింది. చూపు సమస్యలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి ఉచిత శస్త్రచికిత్సలు చేయించేందుకు ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు తెలిపారు.

### గిరిజనులకు వైద్య భరోసా

ఆర్థిక ఇబ్బందులు, రవాణా సౌకర్యాల కొరత కారణంగా వైద్య సేవలకు దూరంగా ఉండే గిరిజనులకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కేవలం వైద్య పరీక్షలకే పరిమితం కాకుండా అవసరమైన వారికి తదుపరి చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జోనల్ చైర్మన్ రవికుమార్, శాలేం రాజు, గోలి తిరుమలరావు, మాగంటి దొరబాబు, దేవీపట్నం విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వైద్య సేవలు అందించిన లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య బృందాలకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన..!
## రూ.3.58 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



మాచర్ల: ఆర్సి ఇన్చార్జి సెప్టెంబర్ 11;నేటి శుభోదయ : మాచర్ల నియోజకవర్గంలో శనివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సుడిగాలి పర్యటన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం రూ.3.58 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.కారంపూడి మండల కేంద్రంలో రూ.42 లక్షల నిధులతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. అలాగే అక్కడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రూ.50 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించనున్నారు.అనంతరం దుర్గి మండలం అడిగొప్పలలోని శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం వద్ద రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంక్, సంపు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.రెంటచింతల మండలం గోలి గ్రామంలో రూ.1.90 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు కూడా ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, విద్య, తాగునీటి మౌలిక వసతులను మెరుగుపరిచే లక్ష్యంతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

## కెనడా మాంట్రియల్లో 84 వ ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రపంచ సమావేశాలలో ప్రసంగించిన డా.టీ.వీ. నారాయణ....!!

**భారతకు చెందిన పలువురు ఫార్మసీ రంగ ప్రముఖుల ప్రశంసలు, అభినందనలు**



కోరుకొండ, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);సౌత్ ఈస్ట్ ఆసియా ప్రాంత ఫార్మసీ సంస్థల అధ్యక్షులుగా డా.టీ.వీ. నారాయణ ప్రసంగం ప్రపంచ ఫార్మసీ రంగా ప్రముఖులను ఆకట్టుకుంది.ఈ నెల కెనడా లోని మాంట్రియల్ నగరమందు జరిగిన 84వ ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రపంచ సమావేశాలలో వికాస్ ఫార్మసీ డైరెక్టర్, భారతీయ ఫార్మసీ రంగ ప్రముఖులు డా.టీ.వీ. నారాయణ పాల్గొన్నారు. ఈ సంస్థ కు అనుబంధ సంస్థ అయినటువంటి సౌత్ ఈస్ట్ ఆసియా ప్రాంత ఫార్మసీ ఫోరమ్ అధ్యక్షులు అయిన డా టీ.వీ. నారాయణ జీవన శైలి ద్వారా సంక్రమించే వ్యాధుల నిర్వహణ లో కమ్యూనిటీ ఫార్మసిస్ట్ ల పాత్ర మరియు శిక్షణ అనే అంశాలపై ప్రసంగించారు.ఇటీవల ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ మరియు సౌత్ ఈస్ట్ ఆసియా ప్రాంత ఫార్మసీ సంస్థ అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమ్యూనిటీ ఫార్మసిస్ట్ లకు జీవనశైలి వ్యాధి రక్తపోటు పరీక్ష మరియు వాక్సినేషన్ చేసే విధానంలో శిక్షణా శిబిరం రాజమండ్రి ఎయిర్పోర్ట్ వద్ద గల వికాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల లో నిర్వహించారు. ఈ అరుదైన ఘనత సాధించిన డా.టీ.వీ. నారాయణ ను కళాశాల సెక్రటరీ డా.టీ. భరత్ వికాస్, ప్రిన్సిపల్ డా. సుమలత, వైస్ ప్రిన్సిపల్స్ డా.యస్. మురళీధర్, పి.వాసుబాబు , బోధన సిబ్బంది , వివిధ ఫార్మసీ కళాశాలల, యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ అభినందించారు.



## మా సమస్యలపైనే ఫిర్యాదు చేయాల్సి వచ్చింది

**- ప్రజాప్రతినిధులమని చూడకుండా దాడి- దాడులను ఖండించాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉన్నారు**

**- మహిళా కమిషన్, ఎన్‌హెచ్ ఆర్‌సీకి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదు**

**- తక్షణం డీజీపీని నివేదిక కోరతామన్న మహిళా కమిషన్ చైర్ పర్సన్**

హైదరాబాద్, ప్రజాతంత్ర, సెప్టెంబర్ 11 : ప్రభుత్వ దుర్మార్గపు పాలనపై ప్రజల పక్షాన పోరాడాల్సిన తాము తమను రక్షించుకునేందుకు, తమ సమస్యను పరిష్కరించుకునేందుకు పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై ప్రజాప్రతినిధులమని కూడా చూడకుండా తన గొంతు నులమగా, సహచర ఎమ్మెల్యే చీర లాగి అత్యంత అవమానానికి గురిచేశారని కన్నీటిపర్యంతమయ్యారు. అసెంబ్లీ ప్రాంగణంలో తమ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి, పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ ఢిల్లీ వేదికగా పోరును ముమ్మరం చేసింది. మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల దురుసు ప్రవర్తన, తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగించడంపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహట్కర్‌ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతరం జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతిని కలిసి ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, పోలీసుల చేత అవమానించడం, శాసనసభ్యులుగా తమ హక్కులకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం వంటి అంశాలను కమిషన్ల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల దాడులపై స్పందించాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనలకు సంబంధించిన అన్ని సీసీటీవీ ఫుటేజీలను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తగిన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. తక్షణం డీజీపీని నివేదిక కోరతామని మహిళా కమిషన్ చైర్ పర్సన్ హామీ ఇచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమకు అవమానం జరిగిందని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలను దేశం మొత్తం గమనిస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు సమస్యలపై సభలో చర్చ జరగాలని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే సమావేశాల ప్రారంభ రోజునే తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించాక అసెంబ్లీలో అడుగుపెట్టకముందే పోలీసులు తమను నిలువరించారని చెప్పారు. నల్ల దుస్తులు ధరించడాన్ని కారణంగా చూపి అడ్డుకున్నారని, అయితే తమ దుస్తులపై ఎలాంటి అభ్యంతరకరమైన రాతలు లేవని స్పష్టం చేశారు. తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరు ఇచ్చారు అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా అవమానకరంగా ఉందని, చీర, జుట్టు పట్టుకుని లాగారని, ఇతర ఎమ్మెల్యేలను కింద పడేసి తొక్కారని ఆరోపించారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. 'మా మనసులు గాయపడ్డాయి.. భారమైన గుండెలతో మాట్లాడుతున్నాం.. మహిళలుగా మాకు అవమానం జరిగింది.. శాసనసభ్యులుగా మా హక్కులకు భంగం కలిగింది' అని సబిత ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడి జరిగి వంద గంటలు దాటినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆరోపించారు. మరోవైపు తమపైనే కేసులు నమోదు చేయడం రాజకీయ నాటకమని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ ఫిర్యాదు చేసినా న్యాయం జరగనందునే ఢిల్లీకి వచ్చామని తెలిపారు.

**మా సమస్యలపై ఫిర్యాదు చేయాల్సి వచ్చింది**

సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శాసనసభ్యులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును పూర్తి వివరాలతో జాతీయ కమిషన్లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించాల్సిన తాము ఇప్పుడు తమపై జరిగిన దాడి గురించి మాట్లాడాల్సిన పరిస్థితి రావడం అత్యంత దారుణమని అన్నారు. 'ప్రజా సమస్యలపై మా గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు.. అందుకే మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారు.. రాష్ట్రంలో న్యాయం జరగలేదని భావించి ఢిల్లీకి వచ్చాం' అని సునీత అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేయించి తిరిగి తమపైనే కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. తమకు జరిగిన అవమానంపై అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని, స్పీకర్ స్పందించి ఉంటే ఆయనకు చేతులెత్తి నమస్కరించేవాళ్లమని అన్నారు.

**పథకం ప్రకారమే అడ్డుకున్నారు : జగదీశ్‌రెడ్డి**

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత జరుగుతున్న అప్రజాస్వామిక ఘటనలను రాష్ట్ర ప్రజలతోపాటు దేశం మొత్తం చూస్తోందన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌ను శాసనసభకు రాకుండా పథకం ప్రకారం అడ్డుకున్నారని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధులపై దాడులు చేయించడం ద్వారా ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా వ్యవహరించారన్నారు. తమ ఎమ్మెల్యేలపై భౌతిక దాడులకు పాల్పడ్డారని, హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా తమపై కేసులు పెట్టారని ఆరోపించారు. ఎమర్జెన్సీ రోజులను తలపించేలా కాంగ్రెస్ ప్రభుత్వ నైజం బయటపడుతోందని ఆయన విమర్శించారు. అధికారులు పూర్తిగా ముఖ్యమంత్రి, మంత్రుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై దాడికి పెద్ద సంఖ్యలో వ్యక్తులను ఉసిగొల్పి ఎస్కార్ట్ ఇచ్చి పంపారని ఆరోపించారు. కేసీఆర్ ఇంటి వద్దకు వెళ్లిన తమ ఎమ్మెల్యేలను అరెస్టు చేశారన్నారు. మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు పురుష పోలీసులను, పురుష ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు మహిళా పోలీసులను ఉపయోగించడం శిఖండి రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

### ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని భయపడి సస్పెండ్ చేశారు : పల్లా

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు రోజులుగా హైడ్రామా జరుగుతోందన్నారు. అన్ని అంశాలపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సభను కొద్ది రోజులకే పరిమితం చేసి ప్రతిపక్ష సభ్యులను సభకు రాకుండా చేశారని విమర్శించారు. భూ కుంభకోణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ వైఫల్యాలు సహా అన్ని అంశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీస్తారని, సమాధానం చెప్పలేకనే కుట్రపూరితంగా తమను సస్పెండ్ చేసినట్లు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై దాడికి ఎమ్మెల్యేలు, విప్‌లను పంపి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయంగా రాక్షసానందం పొందారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు పతనం దగ్గరపడిందని వ్యాఖ్యానించారు.

### రేవంత్ దాష్టీకాలను రాహుల్ కట్టడి చేస్తారా : ఎంపీ వద్దిరాజు

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై సోనియా, రాహుల్ గాంధీలకు లేఖలు రాశామని తెలిపారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న దాష్టీకాలను రాహుల్ గాంధీ కట్టడి చేస్తారా లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం, శాసనసభ్యుల హక్కులను కాపాడాలని కోరారు. కమిషన్ల సభ్యులను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి దివికొండ దామోదర్ రావు, ఎమ్మెల్సీ వాణిదేవి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ లీగల్ సెల్ బృందం నుంచి బీఎస్ ప్రసాద్, సోమా భరత్, లలితా రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.తెలుగు జాతీయ వార్తలు, ప్రత్యేక కథనాలు, ట్రెండింగ్ వీడియోల కోసం మా ్రాతీఘయఘ్తీతీఘ వెబ్‌సైట్ ను సందర్శించండి. తాజా అప్ డేట్స్ కోసం మా ఛానల్ ను ఫాలో కండి.. అలాగే మా ప్రజాతంత్ర, యూట్యూబ్ చానల్ ను సబ్ స్క్రైబ్ చేసుకోండి.. మీ అభిప్రాయాన్ని కామెంట్ రూపంలో పంచుకోండి . మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో షేర్ చేయడం మర్చిపోవద్దు

## వినాయక చవితి మండపాలకు ఆన్లైన్ అనుమతి తప్పనిసరి

**సిఐ గోపాలకృష్ణ, యస్ ఐ సంతోష్ కుమార్**



చింతూరు, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ ::: వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు ప్రభుత్వ సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని చింతూరు సీఐ గోపాలకృష్ణ, యస్ ఐ సంతోష్ కుమార్ సూచించారు .మండపం ఏర్పాటు చేసే ప్రదేశంలో లౌడ్ స్పీకర్లు పెట్టి అర్ధరాత్రి వరకు ప్రజలకు సౌండ్ పొల్యూషన్ చేయరాదని తెలిపారు. నిమజ్జనం వివరాలను దరఖాస్తులో నమోదు చేయాలని తెలిపారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది కలిగేలా రహదారులకు అడ్డంగా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు.ప్రతి మండపం వద్ద కమిటీ సభ్యులు లేదా వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, సాధ్యమైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో మద్యం సేవించి శాంతిభద్రతలకు ఆటంకం కలిగించకుండా నిబంధనలు పాటించాలని సీఐ స్పష్టం చేశారు.వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని సీఐ గోపాలకృష్ణ, ఎస్ ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

## "వైసీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిల్లగుంట వైసిపి కార్యకర్తలు"



పెంటపాడు సెప్టెంబరు 11 (నేటి-శుభోదయ) పెంటపాడు మండలం దర్శిపర్రు శివారు బిల్లగుంట గ్రామ వైసిపి కార్యకర్తలు శుక్రవారం తాడేపల్లిగూడెం వైసిపి ఇన్చార్జ్ వడ్డీ రఘురామనాయుడు ను వైసిపి పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడ్డీ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసికట్టుగా పోరాడాలని, ఎవరు అధైర్య పడవద్దు అని మీ వెనుక నేనుంటానని హామీ ఇచ్చారు.

స్థానిక సంస్థలలో పార్టీ నిలబెట్టిన వ్యక్తులకు విజయం కోసం కృషి చేయాలని ఆయన కోరారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని తాడేపల్లిగూడెంలో వైసీపీ జెండా ఎగురవేసి నేను ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తానని ఆయన చెప్పారు.

ఆయనను కలిసిన వారిలో పెంటపాడు కూనాగరపేట నాయకులు మారంపూడి రవికుమార్, మాజీ వార్డు మెంబర్ మారంపూడి ఏసుదాసు, కర్రీ శివారెడ్డి, కళింగ రాజ్ కుమార్ బిల్లగుంట కార్యకర్తలు యందం గాంధీ, యందం రామకృష్ణ, కిల్లాడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి



యాడికి సెప్టెంబర్ 11 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలంలో ఈ నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు, వివిధ గ్రామాల మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ఆర్. శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. ఉత్సవాల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.మండపాల వద్ద విద్యుత్ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మైక్ సెట్ల వినియోగం, నిమజ్జన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఉత్సవ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, కులమతాలకు అతీతంగా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫైర్ ఆఫీసర్లు జె. రామాంజనేయులు రెడ్డి, యు. మనోహర్, ఏఎస్ఐ జి. వెంకటేష్, డిప్యూటీ ఎంపీడీవో శశికళ, వీఆర్వో దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు..

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .